జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీలకు క్రీడాకారులు

సుభాష్‌నగర్, మే 28 (ఆంధ్రజ్యోతి): జాతీయ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికైనట్లు సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రభాకర్‌రెడ్డి, గంగామోహన్‌లు తెలిపారు. బాలుర విభాగంలో నిఖిల్ చంద్ర, అర్వింద్, లక్ష్మేందర్ కుమార్, చందు, బాలికల విభాగంలో నిశిత, లిఖిత, సౌజన్య, గంగోత్రిలు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు మే 29 నుంచి జూన్ 2 వరకు ఛండీగఢ్‌లో జరిగే 43వ జాతీయ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలో పాల్గొంటారని తెలిపారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు
వీసీలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం

2న రాజీవ్ యువ వికాసం లబ్ధిదారులకు మంజూరు పత్రాలు

- మొదటగా 50వేలు, లక్షలోపు లబ్ధిదారులకు అందజేత
- కలెక్టర్లతో వీసీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

నిజామాబాద్ అర్బన్, మే 28 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసం పథకం కింద ఎంపికైన లబ్ధిదారులకు రాష్ట్ర అవతరణ దినోత్సవం జూన్ 2న మంజూరు పత్రాలు (ప్రొసిడింగ్స్) అందజేస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావులతో కలిసి ఆయన కలెక్టర్లతో బుధవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాజీవ్ యువ వికాసం పథకంపై సమీక్ష జరిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కేటగిరిలను కలుపుకొని రాజీవ్ యువ వికాసం పథకానికి 16లక్షల 23వేల 764 దరఖాస్తులు వచ్చాయని అన్నారు. జూన్‌లో 50వేలు, లక్షలోపు సబ్సిడీ రుణ కేటగిరిలోను సుమారు 85వేల మంది లబ్ధిదారులకు మొదటగా మంజూరీ తెలపడం జరుగుతుందన్నారు. లబ్ధిదారులకు జూన్ 10 నుంచి 15 తేదీ వరకు యూనిట్ల స్థాపన, నిర్వాహణ, మార్కెటింగ్ తదితర అంశాలపై శిక్షణ ఉంటుందని తెలిపారు. జూన్ 16 నుంచి 20వ తేదీ వరకు సబ్సిడీ మొత్తాలను విడుదల చేస్తారని, 21 నుంచి 31 వరకు యూనిట్ల గ్రౌండింగ్ జరిగేలా పర్యవేక్షణ చేయాలన్నారు. ఈ షెడ్యూల్‌ను అనుసరిస్తూ జూలైలో లక్ష నుంచి 2లక్షలలోపు కేటగిరికి చెందిన సుమారు లక్ష మంది లబ్ధిదారులకు, ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ మాసాలలో 2లక్షల నుంచి 4లక్షల కేటగిరికి చెందిన మరో 3లక్షల పైచిలుకు మంది లబ్ధిదారులకు మంజూరు తెలపడం జరుగుతుందన్నారు. ఐదు విడతలలో 5లక్షల మంది లబ్ధిదారులకు ఈ పథకం కింద ప్రభుత్వం సబ్సిడీ రూపంలో 6260 కోట్ల రూపాయలను, బ్యాంకు లింకేజీ కింద 1667 కోట్ల రూపాయలను కలుపుకొని మొత్తం 8వేల కోట్ల రూపాయలను వెచ్చిస్తుందన్నారు. మంజూరు చేసిన యూనిట్ల స్థాపన అనంతరం వాటి పనితీరు నిర్వాహణ తీరు తెన్నులను పర్యవేక్షించేందుకు జిల్లాలో మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. మే 29, 30 తేదీలలో జరిగే ఇన్‌చార్జి మంత్రుల సమావేశంలో రాజీవ్ యువ వికాసంపై చర్చించి తుది జాబితా ఆమోదించడం జరుగుతుందన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. రాజీవ్ యువ వికాసం పథకం నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని లబ్ధిదారులు ఎవరూ ఆందోళన చెందవద్దన్నారు. ఈ వీసీలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, అదనపు కలెక్టర్ అంకిత్, లీడ్ బ్యాంక్ మేనేజర్ అశోక్ చౌహాన్, ఎస్సీ కార్పొరేషన్ ఏడీ రమేష్, గిరిజన సంక్షేమ అధికారి నాగోరావు, తదితరులు పాల్గొన్నారు.



- భారీ వర్షానికి ఎన్‌జీవోస్ కాలనీలో నిలిచిన వరద

దంచికొట్టిన వాన

- జిల్లాలో 29.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు
- అత్యధికంగా మాక్లూర్ మండలంలో 90.9 మి.మీటర్ల వర్షం
- వర్షాలతో అప్రమత్తమైన సాగునీటి శాఖ అధికారులు
- చెరువుల మరమ్మతులపై అధికారుల దృష్టి



నగరంలో లోతట్టు ప్రాంతాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, కలెక్టర్ ఇతర అధికారులు

నిజామాబాద్, మే 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో వర్షం దంచి కొట్టింది. జిల్లాలో సీజన్‌కు ముందే వర్షాలు పడుతుండటంతో యంత్రాంగం కూడా అప్రమత్తమైంది. నైరుతి రుతుపవనాల ప్రభావంతో మరికొన్ని రోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు పడతాయని వాతావరణ శాఖ ప్రకటనలతో ఇరిగేషన్ అధికారులు పనుల్లో నిమగ్నమయ్యారు. చెరువుల మరమ్మతులను పూర్తి చేయడంతో పాటు వరదలు వస్తే ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ముందుగానే పనులు పూర్తి చేస్తున్నారు. గండ్లను పూడ్చడంతో పాటు వరద బయటకు వెళ్లకుండా ఉండేందుకు అన్ని గ్రామాల పరిధిలో చర్యలు చేపట్టారు. ఎస్సారెస్పీ పరిధిలో గేట్ల మరమ్మతులను పూర్తి చేయడంతో పాటు గ్రీసింగ్ చేస్తున్నారు. జిల్లాలో వర్షాలు పడుతుండటంతో వ్యవసాయ, వైద్య, ఆరోగ్య శాఖలు, పంచాయతీరాజ్ శాఖ అధికారులు పనుల్లో నిమగ్నమయ్యారు. తమ శాఖల ద్వారా రైతులు, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

జిల్లాలో 29.6 మిల్లీమీటర్ల వర్షం

జిల్లాలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు భారీ వర్షం పడింది. జిల్లాలో అన్ని మండలాల పరిధిలో సరాసరి 29.6 మిల్లీమీటర్ల వర్షం నమోదైంది. జిల్లాలో అత్యధికంగా మాక్లూర్ మండలంలో 90.9మిల్లీమీటర్ల వర్షం పడింది. రేంజల్ మండలంలో 86.5 మిల్లీమీటర్ల వర్షం నమోదైంది. నవీపేటలో 47.1, వర్నిలో 61.2, నిజామాబాద్ సౌత్‌లో 65 మిల్లీమీటర్ల వర్షం పడగా నిజామాబాద్ నార్త్‌లో 79.9 మిల్లీమీటర్ల వర్షం నమోదైంది. నిజామాబాద్ రూరల్‌లో 73.1 మిల్లీమీటర్ల వర్షం పడగా కోటగిరిలో 44.9, రుద్రూర్‌లో 43.7 మిల్లీమీటర్ల వర్షం పడింది. జిల్లాలోని అన్ని మండలాల పరిధిలో 5 మిల్లీమీటర్ల నుంచి 70 మిల్లీమీటర్ల మధ్య ఈ వర్షం ఎక్కువగా నమోదైంది. జిల్లాలోని 33 మండలాల పరిధిలో ఈ వర్షం పడింది. గడిచిన ఆరు రోజులుగా పడుతున్న వర్షాలతో జిల్లాలో సరాసరి సగటు వర్షపాతంకంటే ఎక్కువగా నమోదైంది. జిల్లాలోని 23 మండలాల్లో సాధారణ వర్షపాతం కంటే ఎక్కువ వర్షం పడింది. మిగతా 10మండలాల్లో సాధారణ వర్షం నమోదైంది. వాతావరణ శాస్త్రవేత్తల సమాచారం ప్రకారం మరో ఆరు రోజుల పాటు జిల్లాలో గాలులు వీస్తూ తేలిక పాటి నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపారు.

జిల్లా వ్యాప్తంగా 1080 చెరువులు

జిల్లాలో మొత్తం 1080 చిన్న, మధ్య తరహా, భారీ చెరువులు ఉన్నాయి. ఆయా మండలాల పరిధిలోని చెరువులను పరిశీలిస్తున్నారు. గ్రామాల వారీగా చెరువులను పరిశీలించడంతో పాటు ఎక్కడైనా మరమ్మతు పనులు జరుగుతుంటే వాటిని సత్వరమే పూర్తి చేయాలని ఆదేశాలు ఇస్తున్నారు. వర్షాలు పడుతుండటంతో ఎస్సారెస్పీ అధికారులు కూడా అప్రమత్తం అయ్యారు. జిల్లాతో పాటు మహారాష్ట్రలో వర్షాలు పడుతుండటంతో ప్రాజెక్టులోకి వరదనీరు వచ్చే అవకాశం ఉండటంతో ముందస్తు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఎస్సారెస్పీ వద్ద గేట్ల మరమ్మతులను పూర్తి చేస్తున్నారు. నాలుగు రోజుల క్రితం ఎస్సారెస్పీకి ఇంజనీరింగ్ చీఫ్ శ్రీనివాస్ వచ్చి తనిఖీలు చేశారు. ప్రస్తుతం పడుతున్న అకాల వర్షాలతో ప్రాజెక్టులోకి స్వల్పంగా వరద వస్తుంది. ప్రాజెక్టులోకి ప్రస్తుతం 1794 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులకు గాను ప్రస్తుతం 1061.80 అడుగుల నీళ్లు ఉన్నాయి. ప్రాజెక్టులో పూర్తిస్థాయి కెపాసిటీ 80.5 టీఎంసీలకు గాను 12.324 టీఎంసీల నీళ్లు ఉన్నాయి.

అధికారుల అప్రమత్తం

వర్షాలు పడుతుండటంతో ప్రధాన శాఖల అధికారులు కూడా అప్రమత్తమయ్యారు. వ్యవసాయ పనులు రైతులు చేపడుతుండటంతో విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచుతున్నారు. గ్రామాల వారీగా శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు సమావేశాలను నిర్వహిస్తున్నారు. ఆధునిక పద్ధతులను వివరించడంతో పాటు దిగుబడి వచ్చే వంగడాలను సాగు చేయాలని కోరుతున్నారు. ధర తక్కువ అని గుర్తింపులేని నకిలీ విత్తనాలను కొనుగోలు చేయవద్దని రైతులకు వివరిస్తున్నారు. ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల ఆధ్వర్యంలో రోడ్డు మరమ్మతు పనులు కొనసాగిస్తున్నారు. కల్వర్టులు తెగిపోయిన ప్రాంతాల్లో కొత్తవి నిర్మిస్తున్నారు. వర్షాలపై కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సమీక్షించడంతో పాటు అధికారులకు పలు ఆదేశాలను ఇచ్చారు. ఎక్కడా ఇబ్బందులు లేకుండా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.



నగరంలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు

సుభాష్‌నగర్, మే 28 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు స్వర్గీయ నందమూరి తారక రామారావు 102 జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ చౌరస్తా వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ.. ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలుగుదేశం పార్టీని స్థాపించి రాజకీయంగా తెలుగువారిని అభివృద్ధి దిశగా నడిపించిన ఏకైకవ్యక్తి ఎన్టీఆర్ అన్నారు. పటేల్, పట్వారి వ్యవస్థను రూపుమాపి ప్రజావ్యవస్థను సృష్టించిన మహనీయుడు ఎన్టీఆర్ అని అన్నారు. అనంతరం సుభాష్‌నగర్‌లోగల ఎస్ఎఫ్ఎస్ స్కూల్ వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వినోద్, శంకర్, పురుషోత్తం, రాజు, విష్ణు, ప్రభాకర్, రాజేశ్వర్, నర్సయ్య, సుధాకర్ పాల్గొన్నారు.

'ఉపాధి'లో పశువుల పాకలు
జాబ్ కార్డులు ఉన్న వారికే అవకాశం
పాడి అభివృద్ధిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు
7

విద్యుదాఘాతానికి యువకుడి బలి
8
వేలాడుతున్న తీగలు తగిలి మృతి
మృతదేహంతో గ్రామస్థుల నిరసన



- మాసం చెరువు సమీపంలో ప్రమాదకరంగా మలుపు



- డొంకేశ్వర్ సమీపంలో మలుపు ఇలా..



కిలోమీటర్లు మూడు మలుపులు ఎనిమిది

- అన్నారం-డొంకేశ్వర్ గ్రామాల మధ్య ప్రమాదకరంగా రోడ్డు
- మలుపుల వద్ద దట్టంగా పెరిగిన చెట్లు.. తరచూ ప్రమాదాలు
- అతివేగంతో అదుపు తప్పుతున్న వాహనాలు
- గాయాలపాలవుతున్న ప్రయాణికులు
- మలుపుల వద్ద కానరాని సూచిక బోర్డులు
- పట్టించుకోని సంబంధిత అధికారులు

డొంకేశ్వర్, మే 28 (ఆంధ్రజ్యోతి): మండంలోని పలు రహదారులు ప్రమాదకరంగా మారాయి. ముఖ్యంగా మండల కేంద్రం నుంచి అన్నారం గ్రామానికి వెళ్లే రోడ్డు మూల మలుపులతో యమ డేంజర్‌గా మారింది. మూడు కిలోమీటర్ల లోపు ఎనిమిది మలుపులు ఉండడంతో వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. అతివేగంతోపాటు రోడ్డు వెంట దట్టంగా పెరిగిన చెట్లతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మలుపుల వద్ద సూచిక బోర్డులు లేకపోవడంతో నిత్యం ఎక్కడో ఒక చోట రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. మండలంలోని అన్నారం నుంచి డొంకేశ్వర్ గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి మలుపులు ప్రమాదాలకు నిలయంగా మారాయని వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. ఎక్కువగా తేప్పల మడుగు, మాసం చెరువు సమీపంలో రోడ్డు ప్రమాదాలు జరుతున్నాయి. ఈ గ్రామాల నడుమ రోడ్డు కేవలం మూడు కిలోమీటర్ల దూరం ఉన్న మధ్యలో పంట పొలాలు ఉన్నాయి. కాగా, ఈ రోడ్డు పొడవునా సుమారు ఎనిమిది మలుపులు ఉండడంతో తరచూ ప్రమాదాలకు దారి తీస్తోంది. మూల మలుపుల వద్ద దట్టంగా రెండు పక్కల చెట్లు పెరిగిపోవడంతో వాహనదారులకు ఎదురుగా వచ్చే వాహనం కనపడక ఇబ్బంది పడుతున్నారు. అధికారులు సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడి గాయాల పాలవుతున్నారని పలువురు ఆగ్రహిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి మలుపుల వద్ద సూచిక, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణకు పాటుపడాలని స్థానికులు కోరుతున్నారు.

> **సూచిక బోర్డులు వెంటనే ఏర్పాటు చేయాలి..**
> సంబంధిత శాఖ అధికారులు ప్రమాదకరమైన మలుపులను గుర్తించి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి. వాహనదారులు రాత్రివేళలో ప్రయాణించే సమయంలో మలుపులు తెలియక ప్రమాదాలకు గురవుతున్నారు. మలుపుల వద్ద దట్టంగా చెట్లకొమ్మలు పెరగడంతో రాత్రి సమయాల్లో ఎదురుగా వస్తున్న వాహనాలు కనపడక ప్రమాదాలు జరుగుతున్నాయి. ముందుగా మలుపుల వద్ద చెట్లను తొలగించాలి. – సాగర్, అన్నారం.



బ్లాక్ ఫిల్మ్‌ను తొలగిస్తున్న పోలీసులు

బ్లాక్ ఫిల్మ్ వాడకంపై పోలీసుల స్పెషల్ డ్రైవ్

నిజామాబాద్ అర్బన్, మే 28 (ఆంధ్రజ్యోతి): కార్లపై నిషేధిత బ్లాక్ ఫిల్మ్ వాడకంపై ట్రాఫిక్ పోలీసులు నగరంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ ఆధ్వర్యంలో బుధవారం తనిఖీలు నిర్వహించి బ్లాక్ ఫిల్మ్ వాడుతున్న కార్లను గుర్తించి జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ ప్రసాద్ మాట్లాడుతూ.. మోటార్ వాహనాల చట్టం, ఆర్‌టీఏ నిబంధనల ప్రకారం కార్ డోర్ అద్దాలకు బ్లాక్ ఫిల్మ్ వేయడం నేరం అని ఇది ప్రజల భద్రతకు హాని కరం అన్నారు. ఇందులో ఆర్ఐ వినోద్, ఆర్ఎస్సై సుమన్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేటు ఆసుపత్రులలో కొనసాగుతున్న తనిఖీలు

నిజామాబాద్ అర్బన్, మే 28 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రైవేటు ఆసుపత్రులలో 3వ రోజు బుధవారం తనిఖీలు కొనసాగాయి. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా అగ్నిమాపక శాఖ, పోలీసు శాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. నగరంలోని ఎస్ఎస్ బాలాజీ ఆసుపత్రి, ప్రగతి ఆసుపత్రిలలో అధికారులు తనిఖీలు నిర్వహించి ఆసుపత్రులలో ఉన్న భద్రత ప్రమాణాలను పరిశీలించారు. అగ్నిప్రమాద నివారణ పరికరాల నిర్వాహణ, అత్యవసర నిష్క్రమణ మార్గాల పరిశీలన చేశారు. పలు లోపాలను ఉన్నట్లు గమనించి వాటిని సరిచేసుకోవాలని సూచించారు. ఈ తనిఖీలలో డిప్యూటీ డీఎంహెచ్‌వ అంజనాదేవి, 1వ టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి, ఫైర్ స్టేషన్ ఆఫీసర్ శంకర్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీ సాయిచైతన్య

నూతన చట్టాలపై అవగాహన ఉండాలి

- పోలీసు కమిషనర్ సాయిచైతన్య

నిజామాబాద్ అర్బన్, మే 28 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం 2024 జూలై 1నుంచి కొత్తగా ప్రవేశపెట్టిన చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, పాత చట్టాలను సవరించి మూడు కొత్త చట్టాలను రూపొందించారని ఈ చట్టాల ద్వారా ప్రజలకు న్యాయం జరుగుతుందని సీపీ సాయిచైతన్య అన్నారు. బుధవారం నగరంలోని శ్రీరామ గార్డెన్‌లో నూతన నేర న్యాయ చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటి వరకు అమలులో ఉన్న పాత చట్టాలు ఐపీసీ, సీఆర్‌పీసీ చట్టాలు రద్దయ్యాయని వీటి స్థానంలో భారతీయ న్యాయ సంహిత భారతీయ నాగరిక సురక్ష సంహిత భారతీయ సాక్ష్యా అదినియం చట్టాలు అమల్లోకి వచ్చాయని అన్నారు. ఈ చట్టాలపై మీడియా ప్రతినిధులకు అవగాహన కల్పించి చట్టాల గురించి ప్రజలకు తెలియజేయాలనే ఉద్దేశ్యంతో ఈ సదస్సు నిర్వహించామని సీపీ తెలిపారు. జనరల్‌గా రాసే వార్తలకు, క్రైమ్ వార్తలకు తేడా ఉందని క్రైమ్ వార్తలు అయితే తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలన్నారు. మైనర్‌లకు సంబంధించిన కేసులో వారి పేర్లను, కుటుంబ సభ్యుల వివరాలను ఎలాంటివైనా రాయకూడదని తప్పనిసరిగా సంబంధిత అధికారి వివరణ తీసుకొని వార్తను ప్రచురించాలన్నారు. సోషల్ మీడియాలో ఏవైనా ఫొటోలు కానీ వీడియో కానీ పోస్ట్ చేసే ముందు వారి అనుమతి తీసుకోవాలన్నారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సీపీ నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. మీడియా ప్రతినిధుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ బస్వారెడ్డి, నిజామాబాద్, ఆర్మూర్, బోధన్, ట్రాఫిక్ ఏసీపీలు రాజావెంకట్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్, మస్తాన్ అలీ, రూరల్ ఎస్సై ఆరీఫ్ ఉద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పసుపు బోర్డుకు కార్యాలయం కేటాయింపుపై సంబరాలు

మోపాల్, మే 28 (ఆంధ్రజ్యోతి): జాతీయ పసుపు బోర్డు కార్యాలయానికి నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాన్ని కేటాయించడాన్ని హర్షిస్తూ బుధవారం నిజామాబాద్ మార్కెట్ యార్డులో బీజేపీ నేతలు, వ్యాపారులు సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ, పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అర్వింద్ చిత్రపటాలకు పసుపు బోర్డు చైర్మన్ పల్లెగంగారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బాణాసంచా కాల్చి సంబరాలు చేశారు. మహిళా నాయకులు పసుపు పూసుకొని సంబరాలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వడ్డి మోహన్ రెడ్డి, స్రవంతిరెడ్డి, న్యాలంరాజు, గంజ్ వ్యాపారులు మాస్టర్ శంకర్, మాజీ కార్పొరేటర్లు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



ప్రధాని మోదీ, ఎంపీ అర్వింద్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

ఎంపీ వల్లే జిల్లాకు పసుపు బోర్డు..

సుభాష్‌నగర్: జిల్లా కేంద్రంగా పసుపు బోర్డు కార్యాలయాన్ని ఏర్పాటు చేయడంలో ఎంపీ ధర్మపురి అర్వింద్ కృషి మరువలేనిదని ఎంపీ వల్లే జిల్లాలో పసుపు బోర్డు ఏర్పాటయిందని జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి అన్నారు. మిగతా 8వ పేజీలో...

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



కమ్మర్‌పల్లి ఆస్పత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి రాజశ్రీ

కమ్మర్‌పల్లి, మే 28: (ఆంధ్రజ్యోతి) ఆసుపత్రి సిబ్బంది సమయపాలన పాటిస్తూ ఆసుపత్రికి వచ్చే రోగులు గర్భిణులకు, మెరుగైన సేవలందించాలని ప్రస్తుత పరిస్థితితుల్లో వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాని జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ రాజశ్రీ అన్నారు. బుధవారం కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి పరిసరాలు పరిశీలించి రోగులకు సంబంధించిన రికార్డులను ఆమె పరిశీలించారు. అనంతరం వైద్య సిబ్బందితో మాట్లాడుతూ.. గర్భిణులకు ప్రతీవారం తగుపరీక్షలతో పాటు అవసరాను గుణంగా వారికి రక్త పరీక్షలు చేయాలని, పౌష్టికాహారంపట్ల అవగాహన కల్పించాలని సూచించారు. ఈసందర్భంగా ఆసు పత్రిలో, ఆసుపత్రి పరిధిలోని ఆరోగ్య ఉపకేంద్రాలలో రోగులకు అందించే వైద్యసేవలు, పిల్లలకు ఇచ్చే వ్యాక్సిన్లు వివరాలను స్థానిక వైద్యులు డాక్టర్ నర్సింహస్వామి, డాక్టర్ హసీన, వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వీహెచ్‌వో వెంకటరమణ, ఫార్మసిస్టు శరత్, వైద్యసిబ్బంది ఉన్నారు.

వీధి కుక్కల దాడిలో మరో జింక మృతి



టాక్లీ గ్రామంలో మృతిచెందిన జింక పిల్ల

కోటగిరి,మే28(ఆంధ్రజ్యోతి): వీధి కుక్కల దాడిలో మరో జింక మృతి చెందిన ఘటన పొతంగల్ మండలంలోని టాక్లీ గ్రామంలో చోటు చేసుకుంది. టాక్లీ గ్రామ శివారులో జింక సంచరిస్తుండగా వీధి కుక్కలు వెంట పడ్డాయి. కుక్కల దాడిలో జింకకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. అటవీశాఖ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని జింక మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోటగిరి వెటర్నరీ ఆసుపత్రికి తరలించారు. గత నాలుగు రోజుల వ్యవధిలో మూడు జింకలు మృతి చెందగా మరో జింక స్వల్ప గాయాలతో బయటపడింది. వీధి కుక్కలను నియంత్రించాలని సోంపూర్, టాక్లీ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలి

మోర్తాడ్, మే28(ఆంధ్రజ్యోతి): విత్తన దుకాణాలలో రైతులు కొనుగోలు చేసిన విత్తనాలకు, పురుగు మందులకు, మందుసంచులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని మండల వ్యవసాయాధికారి హరీష్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని విత్తన డీలర్ల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ లైసెన్సులు ఎక్సరిడేట్, తెచ్చిన ప్రతీ విత్తనానికి ఇవ్వాల్సిన కాపీ, ప్రిన్సిపల్ సర్టిఫికేట్ తప్పనిసరిగా ఉండాలని, విత్తనాలకు సంబంధించిన స్టాక్‌బోర్డు పై నిల్వ వివరాలు రాయాలని ఆదేశించారు. ప్రతీ రైతుకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని అన్ని లైసెన్సులకు సంబందించిన రిజిస్టర్లను విధిగా మేంటెనెన్స్ చేయాలని, ఎట్టి పరిస్థి తుల్లో రైతులకు లూజు విత్తనాలు అమ్మరాదన్నారు. వచ్చిన స్టాక్‌ను ఎప్పటికప్పుడు రిజిస్టర్ లో ఎంట్రీ చేయాలని దుకాణాలలో లైసెన్సులు కనబడే విధంగా ఉంచాలని ఏవో ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల డీలర్లు దేవరాజ్, శ్రీనివాస్, అన్వేష్, సునీల్ పాల్గొన్నారు.

నందిగామలో చిరుత పులి సంచారం

నవీపేట,మే28(ఆంధ్రజ్యోతి): మండలంలోని నందిగామలో చిరుత పులి సంచరిస్తుందని గ్రామస్థులు తెలిపారు. బుధవారం మేకల మందల కాపలదారులకు గుట్టపైన చిరుత పులి కనిపించిందని గ్రామస్థులు వివరించారు. గ్రామ శివారులో చిరుత పులి పాదముద్రలు సైతం లభ్యమయ్యాయని వారు వివరించారు. ఈ విషయంపై ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ జహూర్‌ను వివరణ కోరగా నందిగామలో చిరుత పులి సంచరిస్తున్నట్లు తమ దృష్టికి రాలేదని అన్నారు.

ఎత్తిపోతల పథకం మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని వినతి



మంత్రి ఉత్తమ్‌కుమార్‌ను కలిసిన కమ్మర్‌పల్లి రైతులు

కమ్మర్‌పల్లి, మే 28 (ఆంధ్రజ్యోతి) : చౌట్‌పల్లి హన్మంత్‌రెడ్డి ఎత్తిపోతల పథకం మరమ్మతుల కోసం తగిన నిధులు మంజూరు చేయాలని కోరుతూ బుధవారం బాల్కొండ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ ముత్యాల సునీల్ కుమార్ ఆధ్వర్యంలో కమ్మర్‌పల్లి రైతులు మంత్రిని ఆయన నివాసంలో కలిసి విన్నవించారు. ఎత్తిపోతల పథకం పైప్‌లైనింగ్ తరుచూ లీకేజీలు ఏర్పడి నీరందడం లేదని, వారం రోజులు కూడా నడవకుండానే లీకేజీలు ఏర్పడుతున్నాయని రైతులు మంత్రికి వివరించారు. మంత్రిని కలిసిన వారిలో బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్ చార్జ్ ముత్యాల సనీల్ కుమార్, రైతులు సుంకెట రవి, గడ్డం చిన్న నర్సారెడ్డి, వేముల గంగాఆరం, వేముల చిన్న నర్సయ్య, రంజిత్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్ ఇవ్వడంలో జాప్యం సరికాదు

కోటగిరి,మే28(ఆంధ్రజ్యోతి): ఓ వైపు విద్యా సంవత్సరం ప్రారంభం అవుతుంటే విద్యార్థులకు కుల, ఆదాయ సర్టిఫికేట్‌లు జారీ చేయడంలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై సీపీఐ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కోటగిరి తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం రెవెన్యూ అధికారుల తీరును నిరసిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి విఠల్ గౌడ్, నాయకులు గంగాధర్, రాములు, రాజు, గజేందర్, వీరేశం, శంకర్, రాములు, దత్తు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు యోగా ఎంతో అవసరం

డిచ్‌పల్లి, మే 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఘన్‌పూర్ గ్రామంలోని 30 పడకల ఆసుపత్రిలో బుధవారం ఆయుర్వేదిక్ బిల్డింగ్ వద్ద యోగా శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో ప్రతీరోజు పిల్లలకు యోగా నేర్పించడం జరుగుతుందని యోగా శిక్షకురాలు స్వప్న అన్నారు. ఓంసాయి, సాగర్, మోహన్, ప్రసాద్, సంజు, ఆనంద్ పాల్గొన్నారు.

భరతనాట్యంలో ప్రతిభ చూపిన శ్రీవల్లి

వేల్పూర్, మే 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన కోమన్‌పల్లి శ్రీవల్లి హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో చేసిన భరతనాట్యం అందరిని అలరింపజేస్తూ మన్ననలు పొందింది. ఈ సందర్భంగా శ్రీవల్లి మాట్లాడుతూ తనకు చిన్నప్పటినుంచి డ్యాన్స్, భరతనాట్యం అంటే చాలా ఇష్టమని తన తల్లిదండ్రుల ప్రోత్సహం వల్ల డ్యాన్స్ స్కూల్‌లో చేరి డ్యాన్స్ తో పాటు భరతనాట్యం నేర్చుకోవడం జరిగిందన్నారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతీలో జరిగిన ప్రొగ్రాంలో భరతనాట్యం చేసే అవకాశం దక్కడం ఆనందంగా ఉందని శ్రీవల్లి తెలిపారు.



కూనేపల్లిలో భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



తిమ్మాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గుపోసిన అధికారులు

అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు అందిస్తాం

● బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

రెంజల్,మే28(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్క నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కూనేపల్లి, బాగేపల్లి గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి పేదవాడిని గుర్తించి వారికి పక్కా ఇళ్లు నిర్మించిన ఘనత కాంగ్రెస్‌ది అయితే. మళ్లీ అధికారంలోకి వచ్చిన తర్వాత పక్కా ఇళ్లను నిర్మించిన ఘనత కాంగ్రెస్‌కే దక్కిందన్నారు. గత ప్రభుత్వంలో పేదింటి కలను సాకారం కాలేదని, చాలా మంది నిరుపేదలు ఇంటిని నిర్మించుకోలేక నానా అవస్థలు పడ్డారన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రతి పేదోడికి ఇంటి నిర్మాణానికి శ్రీకారం చుట్టిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే పేదల పార్టీ అని, పేదలను గుర్తించి వారికి న్యాయం చేసే పార్టీ కాంగ్రెస్ పార్టీ అన్నారు. విడతల వారిగా ఇంటి నిర్మాణానికి డబ్బులు అందజేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ సంక్షేమ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, పార్టీ మండల అధ్యక్షులు మొబిన్ ఖాన్, మాజీ జడ్పీటీసీ నాగభూషణం రెడ్డి, తహసీల్దార్ శ్రావణ్ కుమార్, ఎంపీడీవో వెంకటేష్, కాంగ్రెస్ నాయకులు సాయిరెడ్డి, జావీదోద్దీన్, లింగం, ధనుంజయ్, కరణ్ రెడ్డి, నీరడి సాయిలు, సురేందర్ గౌడ్, సాయిబాబా గౌడ్, నితిన్, సాయిబాబా గౌడ్, సాయిరెడ్డి, జాదవ్ గణేష్, యూత్ కాంగ్రెస్ బోధన్ అసెంబ్లీ అధ్యక్షుడు కార్తీక్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గైని కిరణ్, అబ్బాల్ల శ్రీకాంత్, కుర్మె శ్రీను,యోగేష్, సురేష్, సద్దాం, ప్రకాష్, లింగం పాల్గొన్నారు.

ఆలూర్: ఆలూర్ మండల కేద్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల కోసం రూ. 5 లక్షలు మంజూరు అయినా వారి ఇండ్లకోసం భూమిపూజ పనులు బుధవారం ఆలూర్ గ్రామంలో ఎంపీడీవో గంగాధర్, ఆలూర్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముక్కెర విజయ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల్లో మాట ఇచ్చిన ప్రకారం సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకొని పేదవారికి సొంత ఇంటికల సాకారం చేసే దిశగా ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభి స్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు సీఎం రేవంత్‌రెడ్డికి, ఆర్మూర్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రొద్దుటూరి వినయ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముక్కెర విజయ్, ఏఎంసీ డైరెక్టర్ మల్లారెడ్డి, ఇందిరమ్మ కమిటి సభ్యులు సంజీవ్, పెండ భాస్కర్, కుర్మె చిరంజీవి, నారాయణ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఉదయ్, నవనీత్, పంచాయితీ కార్యదర్శి రాజలింగం, తిరుపతి రెడ్డి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

బాల్కొండ: బాల్కొండ మండలంలో ఇందిరమ్మ ఇళ్లకు మా ర్కింగ్ బుదవారం కాంగ్రెస్ నాయకులు వేశారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరైన లబ్ధిదారులు పనులను వెంటనే ప్రారంభించాలి వారు కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రజనీకాంత్‌రెడ్డి, ఇందిరమ్మ కమిటి సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌రూరల్: ఆలూర్ మండలం దేగాంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు బుధవారం కాంగ్రెస్ నాయకులు, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ గౌడ్ భూమిపూజ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరైన వారు వెంటనే పనులు ప్రారంభిం చాలని లబ్ధిదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు మల్లేష్, సాయిలు, సంతోష్, గంగాధర్, ప్రభాకర్, మహేష్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని అర్గుల్ గ్రామంలో బుధ వారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను అధికారులు ప్రారంభించారు. లబ్ధి దారులు ముందుకు వచ్చి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ముగ్గు పోయగా అధికారులు పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో యూ సుఫ్‌ఖాన్, పంచాయతీ కార్యదర్శి హరీష్, మాజీ సర్పంచ్ గోర్త పద్మ రాజేందర్, ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యుడు సందీప్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మేకుల రమేష్, గ్రామస్థులు పాల్గొన్నారు.

నవీపేట: మండల కేంద్రంలోని శివాజీనగర్, లింగమయ్య గుట్ట కాలనీలలో బుధవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఎంపీడీవో నాగనాథ్ భూమి పూజ నిర్వహించారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు తమ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రవీందర్ నాయక్, భగవాన్, గంగాధర్, గోపాల్, సుజాత తదితరులున్నారు.

మోర్తాడ్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇంది రమ్మ ఇళ్ల పథకం పేద ప్రజలకు వరం లాంటిదని ఎంపీడీవో తిరుమల అన్నారు. బుధవారం మండలంలోని తిమ్మాపూర్‌లో ఇందిరమ్మ గృహ నిర్మాణ లబ్ధిదారులకు ముగ్గుపోసి పనులు ప్రారంభించారు. తిమ్మాపూర్‌కు 38 ఇందిరమ్మ ఇళ్లు మంజూర య్యాయని ఎంపీడీవో తెలిపారు. లబ్ధిదారులు తప్పకుండా ఇళ్లు నిర్మించుకోవాలని, నిర్మించుకున్న వారికి విడుతల వారిగా ప్రభుత్వం డబ్బులు మంజూరు చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మహిపాల్, మండల కాంగ్రెస్ నాయకులు బద్దం రాజశేఖర్‌రెడ్డి, చిన్నారెడ్డి, సురేష్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

భీమ్‌గల్: భీమ్‌గల్ పట్టణ కేంద్రంలోని 8వ వార్డులో బుధవారం ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు కాంగ్రెస్ నాయకులు మంజూరు పత్రాలను అందజేశారు. ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్లను నిర్మించి ఇవ్వడమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకెళ్తుందని వారన్నారు. ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో మండల, పట్టణ అధ్యక్షుడు స్వామి, నర్సయ్య, నాయకులు సురేందర్, శ్రీనివాస్,నరేష్, లింబాద్రి, గంగాధర్ పాల్గొన్నారు.

● హసాకొత్తూర్‌లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులకు భూమి పూజ

కమ్మర్‌పల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు పరుస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను బుధవారం మండలంలోని హసాకొత్తూర్ గ్రామంలో మండల కాంగ్రెస్ నాయకులు లబ్ధిదారులతో కలిసి భూమి పూజ చేశారు. లబ్ధిదారులు త్వరిత గతిన ఇండ్ల నిర్మాణ పనులు ప్రారంభించాలని బేస్మిట్ లెవల్ వరకు రాగానే ప్రభుత్వం చెప్పిన విదంగానే లక్ష రైపాయలు లబ్ధిదారులు కతాలో జమచేస్తుందన్నారు. పనులను బట్టి వంతులవారికిగా ఐదు లక్ష రైపాయలు అందజేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు పడిగెల ప్రవీన్, కాంగ్రెస్ నాయకులు రేవతి గంగాధర్, లింగారెడ్డి, శ్రీనివాస్, తదితర నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో కేంద్ర బృంద సభ్యుల సందర్శన



అంకాపూర్‌లో సందర్శిస్తున్న కేంద్ర బృందం సభ్యులు



అమ్రాద్‌లో జీపీ సిబ్బందితో మాట్లాడుతున్న దృశ్యం

ఆర్మూర్‌రూరల్ , మే 28 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామాన్ని బుధవారం డిల్లీ హోంశాఖ ఆధ్వర్యంలో (సీఎస్ఎస్) సెంట్రల్ సెక్రటేరియేట్ సర్వీసెస్ బృందం సభ్యులు సందర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లబ్ధిదారులకు ఎలా చేరుతున్నాయి నిజమైన లబ్ధిదారులకు అందుతున్నాయా అని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రభుత్వ పథకాలైన రాజీవ్ యువవికాసం ఇందిరమ్మ ఇండ్లు, జాతీయ గ్రామీణ ఉపాధిహామి పథకం, వ్యవసాయ పంట రుణాలపై అడిగి తెలుసుకున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సక్రమంగా అమలు చేస్తున్నారా అనే విషయాన్ని కేంద్ర బృందం సభ్యులు విక్రంసింగ్ గుర్జార్, శిఖాసిన్హా, సుదేష్‌ఖన్వాల్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయితీ అధికారి డీఎల్‌పీవో శివకృష్ణ, ఎంపీడీవో బ్రహ్మానందం, ఏవో హరికృష్ణ, ఎంపీవో శ్రీనివాస్, పంచాయితీ రాజ్ ఏఈ నితిష్, ఏపీవో సురేష్, పంచాయితీ కార్యదర్శి హరీక, అధికారులు పాల్గొన్నారు.

● ప్రభుత్వ పథకాలపై కేంద్ర పరిశీలన బృందం ఆరా

మాక్లూర్: ప్రభుత్వం పేద ప్రజలకు అందజేస్తున్న పథకాలు లబ్ధిదారులకు అందుతున్నాయా అని కేంద్ర పరిశీలన బృందం గ్రామ పంచాయితీ సిబ్బందితో ఆరా తీశారు. బుధవారం మండలంలోని అమ్రాద్, ముల్లంగి గ్రామ సచి వాలయాలలో కేంద్ర పరిశీలన బృందం నలుగురు సభ్యులు పర్యటించారు. ఈ సందర్భంగా వారు రికార్డులను పరిశీలించి ప్రభుత్వ పథకాలపై సిబ్బందిని అడిగి తెలుసు కున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● అబ్బాపూర్(ఎం), జన్నేపల్లిల్లో కేంద్ర బృందం పర్యటన

నవీపేట: మండలంలోని అబ్బాపూర్(ఎం), జన్నేపల్లిలలో బుధవారం కేంద్ర బృందం సభ్యులు పర్యటించారు. నలుగురు బృందం గల సభ్యులు ఆయా గ్రామాలలో అంగన్‌వాడీ కేంద్రాలు, ఉపాధి హామీ పనులు, మహిళ సంఘాల పనితీరు వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరును వారు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నాగనాథ్, ఎంపీవో రామకృష్ణ, ఏపీఎం భూమేష్ గౌడ్, వివిధ శాఖలకు చెందిన సిబ్బంది పాల్గొన్నారు.

డిచ్‌పల్లి: నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలంలోని నడిపల్లి, ఘన్‌పూర్ గ్రామ పంచాయతీలను బుధవారం నలుగురు సభ్యుల కేంద్ర బృందం సందర్శించారు.. ఈ సందర్భంగా స్వచ్ఛభారత్ మిషన్, అమలు అవుతున్న పథకాలు, తడి చెత్త, పొడి చెత్తనిర్వహణ తీరు, వ్యక్తిగత మరుగుదొడ్లపై ప్రజలకున్న అవగాహన, పీఎం ఆవాస్ యోజన, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, భేటీ బచావో, భేటీ పడావో , రైతు భరోసా, రైతు బీమా పథకాల అమలు పై అధికారులు మండల అధికారులతో కలిసి అడిగి తెలుసుకున్నారు. మహిళ సంఘాలతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి యోహన్, ఎంపీడీవో భుక్యలింగంనాయక్, తహసీల్దార్ సతీశ్‌రెడ్డి,ఆర్ఐ సంతోష్, కార్యదర్శులు రాధిక, రమేశ్, ఐసీడీఎస్, వైద్యాధికారులు, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ పరిశీలన



గోవింద్‌పేట్‌లో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

ఆర్మూర్‌రూరల్, మే 28 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మండలం గోవింద్‌పేట్‌లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, డీసీవో శ్రీనివాస్‌రావు, క్లస్టర్ ఆఫీసర్ స్వప్న పరిశీలించారు. తూకం వేసిన ధాన్యాన్ని వెంటవెంటనే రైస్ మిల్లులకు తరలించి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ధాన్యం తరలింపునకు లారీలను త్వరగా తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో కార్యదర్శి రమేష్, రైతులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఉద్యోగికి వినయ్‌రెడ్డి పరామర్శ



మున్సిపల్ ఉద్యోగిని పరామర్శిస్తున్న వినయ్‌రెడ్డి

ఆర్మూర్‌రూరల్, మే28, (ఆంధ్రజ్యోతి):మామిడిపల్లికి చెందిన మున్సిపల్ ఉద్యోగి నరేష్‌ను బుధవారం సికింద్రాబాద్‌లోని యశోధ ఆసుపత్రిలో ఆర్మూ ర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి పరామర్శించారు. నరేష్ గత కొన్ని రోజులుగా అనారోగ్యానికి గురై యశోధ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పెండింగ్‌లో ఉన్న ఈఎస్ఐ బకాయిలు చెల్లిస్తేనే ఈఎస్ఐ ద్వారా మెరుగైన, ఉచిత చికిత్స లభిస్తుందని కుటుంబ సభ్యులు వినయ్‌రెడ్డికి విన్న వించగా పెండింగ్‌లో ఉన్న బకాయిలను ఈఎస్ఐకి చెల్లించాలని మున్సిపల్ కమీషన్‌కు సూచించారు. బకాయిలు చెల్లించడంతో నరేష్‌ను సనత్ నగర్ ఈఎస్ఐ సూపర్ స్పెషలిటీ ఆసుపత్రికి రిఫర్ చేశారు. వినయ్‌రెడ్డి వెంట కాంగ్రెస్ నాయ కులు మారుతిరెడ్డి, తదితరులున్నారు.

ఒకరిపై కేసు నమోదు

భీమ్‌గల్‌రూరల్ , మే 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తిపై పోక్సోచట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేష్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బాలిక ఆమె నానమ్మ వద్దకు వెళ్లగా అక్కడ పరిచయమైన ఒక వ్యక్తి బాధితురాలికి మాయమాటలు చెప్పి అత్యాచారం చేశారన్నారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని బుధవారం ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి విచారణ జరిపినట్లు ఎస్సై తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ఆర్మూర్ టౌన్, మే28(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ 5వ వార్డులో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మాజీ కౌన్సిలర్ శాల ప్రసాద్ బుధవారం పలువురు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. పెర్కిట్‌లోని జ్యోతికి రూ. 22 వేలు, విజయకు రూ. 20వేల చెక్కులను పంపిణీ చేశారు.

ఆర్మూర్ రూరల్ : ఆర్మూర్ మున్సిపల్ పరిధి పెర్కిట్‌లోని నాలుగవ వార్డులో బుధవారం ప్రభుత్వం నుంచి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను వార్డు ఇన్‌చార్జి గుర్రం సునీల్‌రెడ్డి బాధిత కుటుం బాలకు అందజేశారు. కార్యక్ర మంలో మాజీ కౌన్సిలర్ ప్రసాద్, రాజేందర్, శేఖర్ పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి : మండలంలోని కమ్మర్‌పల్లి హసాకొత్తూర్ గ్రామాలకు చెందిన బాధితులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను బుధవారం కాంగ్రెస్ నాయకులు అందజేశారు. కమ్మర్‌పల్లికి చెందిన లావుడ్య శాంతకు 44 వేలే, హీనా బేగంకు 21 వేయిహసాకొత్తూర్‌కు చెందిన పడిగెల సంజీవ్‌కు 50 వేలు, వాల్గోట్ శివవర్ధన్‌కు 20 వేలు మంజూరైనట్లు కమ్మర్‌పల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకెట రవి, మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సయ్య తెలిపారు.

జుక్కల్‌లో భారీ వర్షం

జుక్కల్, మే 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలలో బుధవారం భారీవర్షం కురిసింది. ఖరీఫ్‌సీజన్ ప్రారంభం కావడంతో రైతులు ఎరువులు విత్తనాలు కొనుగోలు చేసుకుని నిలువ ఉంచుకుంటున్నారు. నల్ల రేగడి భూములకు వర్షాలు ఎక్కువ కావడంతో పంట పొలాలు చెరువులు తలపిస్తున్నాయి. వర్షాలు తగ్గుముఖం పడితే రైతులు పంటపొలాల్లో పనులు చేసుకుంటున్నామని రైతులు పేర్కొన్నారు.

'ఎన్ఎస్‌యూఐ నాయకుడి మరణం తీరనిలోటు'

భిక్కనూరు, మే 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాచాపూర్ గ్రామానికి చెందిన ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు కమ్మరి అశోక్(34) బుధవారం అనారోగ్యంతో మృతిచెందగా, ఆయన మృతితీరని లోటని నాయకులు అన్నారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భీంరెడ్డి, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి, పీసీసీ కార్యదర్శి ఇంద్రకర ణ్‌రెడ్డి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

ఇంటిగ్రేటెడ్ పాఠశాల మంజూరుపై హర్షం

కోటగిరి, మే 28 (ఆంధ్రజ్యోతి): పొతంగల్ మండలంలోని సోంపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో గల పీఎస్ఆర్‌నగర్‌లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలను మంజూరు చేయడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. పీఎస్ఆర్ నగర్‌లో బుధవారం సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు పోచారం శ్రీనివాస్ రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు సాయినాథ్, అశోక్, రమేష్, శంకర్, వీర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని వృద్ధుడి మృతి

నిజామాబాద్ అర్బన్, మే 28 (ఆంధ్రజ్యోతి): నగరంలోని దుబ్బ ప్రాంతంలో లారీ ఢీకొని వృద్ధుడు మృతి చెందిన ఘటన బుధవారం ఉదయం జరిగింది. దుబ్బకు చెందిన సుంకరి నర్సయ్య (68) నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో దుబ్బ చౌరస్తా వద్ద వెనుకనుంచి లారీ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. తీవ్రంగా గాయాలపాలైన నర్సయ్యను స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు 3వ టౌన్ ఎస్సై హరిబాబు తెలిపారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఆయన వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు

ఎడపల్లి, మే28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదురుగా బోధన్-నిజామాబాద్ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఇరువురికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం కారు బోధన్ నుంచి నిజామాబాద్ వెలుతుండగా ఎడపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఒక్కసారిగా ఆటో రిక్షా అడ్డు రావడంతో దాన్ని తప్పించబోయి డివైడర్ పైన ఉన్న విద్యుత్ స్థంభాన్ని ఢీ కొట్టింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న ఇద్దరికి గాయాలు కావడంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రాథమిక చికిత్స చేసి క్షతగాత్రులను అంబులెన్సులో జిల్లా ఆస్పత్రికి తరలించారు.

క్లస్టర్ గ్రామంగా నాళేశ్వర్ ఎంపిక

నవీపేట,మే28(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రవేశ పెట్టిన సహజ వ్యవసాయ పద్దతుల కేంద్ర ప్రభుత్వ జాతీయ స్థాయి పథకం నేషనల్ మిషన్ ఆన్ నేషనల్ ఫార్మింగ్(ఎన్ఎంఎన్ఎఫ్) క్లస్టర్ గ్రామంగా మండలంలోని నాళేశ్వర్ ఎంపికైందని ఏవో నవీన్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు సరిన్, నర్సింగ రావు, ఏఈవో వసంత్ కుమార్, నాయకులు ప్రవీణ్, పోతన్న తదితరులున్నారు.

విద్యుదాఘాతంతో వృద్ధుడి మృతి

నవీపేట, మే28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మారానికి చెందిన గోవిందారం గంగారాం(77) అనే వృద్ధుడు బుధవారం ఉదయం విద్యుదాఘాతంతో మృతిచెందాడు. ఏఎస్ఐ మోహన్‌రెడ్డి, స్థానికులు తెలిపిన ప్రకారం ప్రతిరోజు ఉదయం స్థానిక హనుమాన్ మందిరాన్ని శుభ్రం చేయడంతో పాటు గంగారాం ఆలయంలో మైక్‌లో భక్తి పాటలను వేసేవాడని అన్నారు. బుధవారం ఉదయం యధావిధిగా ఆలయానికి వచ్చిన ఆయన మైక్‌లో భక్తి పాటలను ఆన్‌చేసి ఆలయాన్ని శుభ్రం చేస్తుండగా ఆలయ షెడ్డుకు సంబంధించిన పైపు తగలడంతో అతడు విద్యుద్ఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి కూతురు గోదావరి, మనవరాలు అనురాధ ఉన్నారు.

'నూతన ప్రభుత్వ ఆసుపత్రిని ప్రారంభించాలి'

వర్ని,మే28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నిర్మిస్తున్న 50పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి నూతన ఆసుపత్రిని ప్రారంభించాలని సీపీఎం పార్టీ ఏరియా కార్యదర్శి నన్నేసాబ్ బుధవారం వర్ని తహసీల్దార్ సాయిలుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం సీజనల్ వ్యాధులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం పనులు పూర్తి చేయాలన్నారు. బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి చొరవ తీసుకొని నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసేలా కృషి చేయాలన్నారు.

మున్సిపల్ సిబ్బందికి హెల్త్‌క్యాంప్

సుభాష్‌నగర్, మే 28 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సహకారంతో నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో కార్యాలయ సిబ్బందికి మెడికల్ క్యాంప్‌లు నిర్వహించారు. నగరంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో సిబ్బందికి మెడికల్ టెస్టులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్ హాజరయ్యారు. నగరపాలక సంస్థ సిబ్బంది ఉదయం నుంచి అనేక కారణాలతో ఆరోగ్యసమస్యలపై ఇబ్బందులు పడుతుంటారని వారి కోసం ప్రత్యేకంగా హెల్త్ క్యాంప్ నిర్వహించినట్లు తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

నవీపేట,మే28(ఆంధ్రజ్యోతి): మండలంలోని స్టేషన్ ఏరియాకు చెందిన పిట్టల అనూక్ ఇంట్లో చోరీ జరిగిందని ఏఎస్ఐ మోహన్ రెడ్డి తెలిపారు. ఈ నెల 25న అనూక్ భార్య సుమలత ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లిందని, మరుసటి రోజు సాయంత్రం వచ్చి చూడగా ఇంటి తాళం పగులగొట్టి ఉందని అన్నారు. గుర్తు తెలియని దొంగలు ఇంట్లో ఉన్న సామాన్లు చిందర వందర చేయడంతో పాటు సుమారు 25తులాల వెండి వస్తువులను ఎత్తుకెళ్లారని ఏఎస్ఐ పేర్కొన్నారు. పిట్టల అనూక్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

జీలుగ విత్తనాలు పంపిణీకి సిద్ధం

మాచారెడ్డి, మే 28(ఆంధ్రజ్యోతి): మాచారెడ్డి, పాల్వంచ మండలాల్లో జీలుగ విత్తనాలు రైతులకు అందుబాటులో ఉన్నాయని సొసైటీ చైర్మన్ పూల్‌చందినాయక్ , సీఈవో చంద్రారెడ్డి బుధవారం తెలిపారు. మాచారెడ్డి సొసైటీలో 133 జీలుగ బస్తాలు అందుబాటులో ఉన్నాయని ఒక్కొక్క బ్యాగు 30 కిలోలు ఉంటుందని, దీని ధర రూ.2137.50లు ఉందన్నారు. అవసరమున్న రైతులు పట్టాపాస్ బుక్కు జిరాక్స్‌తో ఏఈవో కార్యాలయంలో పర్మిట్ తీసుకోవాలన్నారు.

బిచ్కుంద : మండల కేంద్రంలోని సొసైటీలో జీలుగ విత్తనాలను సొసైటీ చైర్మన్ నల్లార్‌బాలు రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీపరంగా రైతుల అభివృద్ధి కోసం కృషిచేస్తానని తెలిపారు.

తాడ్వాయి : మండలంలోని సబ్సిడీపై జీలుగ విత్తనాలను గురువారం నుంచి పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి నర్సింలు తెలిపారు. 220 బస్తాలు సిద్ధంగా ఉన్నాయన్నారు.

రామారెడ్డి : రైతులకు రెండు వందల జీలుగ విత్తనాలను బుధవారం పంపిణీ చేసినట్లు మండల వ్యవసాయ అధికారి భానుశ్రీ పేర్కొన్నారు. రైతులకు సబ్సిడీపై 50 శాతం పచ్చి రొట్టే విత్తనాలు, 20 బస్తాలు జీలుగ విత్తనాల సంచులను ఇచ్చినట్లు తెలిపారు. రైతులు ఎక్కువమంది రాగా విత్తనాలు పంపిణీపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

'స్వార్థ రాజకీయాలకు బలైన రాష్ట్రం.. జమ్మూకశ్మీర్'



మాట్లాడుతున్న వక్త

నిజామాబాద్ కల్చరల్, మే 28 (ఆంధ్రజ్యోతి): నాటి పాలకుల స్వార్థ రాజకీయాలకు బలైన భారత రాష్ట్రమే జమ్మూకశ్మీర్ అని జమ్మూ కశ్మీర్ స్టడీ సెంటర్ దక్షిణ భారత ఇంచార్జి ఎన్‌వీకే ప్రసాద్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో న్యాల్‌కల్ రోడ్‌లో ఇతిహాస సంకలన సమితి ఆధ్వర్యంలో కాశ్మీర్ చరిత్రలో వక్రీకరణలు వాస్తవాలు అనే అంశంపై నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య వక్తగా హాజరై మాట్లాడుతూ కొందరి స్వార్థ మతచాందస వాదుల చెప్పుడు మాటలు పట్టుకొని కాశ్మీర్ భవిష్యత్తును అంధకారంలోకి నెట్టారన్నారు. ఆనాటి పాలకులు మంచి నిర్ణయం తీసుకుంటే ఇప్పుడు జరుగుతున్న ఉగ్రవాదం వల్ల మూల్యం చెల్లించుకోవాల్సిన పరిస్థితి ఉండేది కాదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన హైకోర్టు న్యాయవాది మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ భారతీయులు తమ వాస్తవ చరిత్రను తెలుసుకునేంత కాలం స్వాతంత్ర్యం లభించినప్పటికీ కూడా భావి తరాల వారికి చరిత్ర చెప్పుకోవడానికి ఏమి ఉండదని అన్నారు. ఈ కార్యక్రమానికి హితిహాస సంకలన సమితి జిల్లా అధ్యక్షుడు నరేష్ కుమార్ అధ్యక్షత వహించగా ఆంజనేయులు, మోహన్‌దాస్, శైలిబెల్లాల్, కందకుర్తి ఆనంద్, డాక్టర్ భూపతి, వెంకటేశ్వర్లు, రాధా, తదితరులు పాల్గొన్నారు.

దేశ చరిత్ర మొత్తాన్ని వక్రీకరించారు

బోధన్ రూరల్, మే 28 (ఆంధ్రజ్యోతి): జమ్మూకాశ్మీర్‌తో పాటు దేశ చరిత్ర మొత్తాన్ని వక్రీకరించారని, జమ్మూకాశ్మీర్ స్టడీ సెంటర్ దక్షిణ భారత ఇన్‌చార్జి ఎంవీకే ప్రసాద్ అన్నారు. బుధవారం బోధన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జమ్మూకాశ్మీర్ ప్రాంతం ప్రపంచంలో అతి సుందరమైన ప్రాంతం అని అలాంటి కాశ్మీర్ ప్రాంతం ఎంతోమంది విచ్ఛిన్నర శక్తుల చేతిలో దాడులకు గురై ఇది ఉగ్రవాదుల స్థావరంగా మారడానికి కారణంగా దశాబ్దాలుగా రాజకీయ ప్రయోజనాల కోసం కాశ్మీర్‌ను వాడుకున్ననాయకుల తప్పిదాలు మాత్రమేనని ఆయన వ్యాఖ్యానించారు.

'ఉపాధి'లో పశువుల పాకలు

● జాబ్ కార్డులు ఉన్న వారికే అవకాశం ● పాడి అభివృద్ధిని ప్రోత్సహించేందుకు చర్యలు



కోటగిరిలో నిర్మిస్తున్న పశువుల పాక

కోటగిరి, మే 28 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ప్రభుత్వం వ్యవసాయ పొలాల్లో పశువుల కొట్టాలతో పాటు మేకలు, గొర్రెలు షెడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. పాడి పశువులు, గొర్రెలు, మేకల పెంపకందారులకు ఆర్థిక తోడ్పాటు అందించేందుకు ప్రభుత్వం వివిధ పథకాలను అమలు చేస్తోంది. ఉపాధి హామీలో జాబ్‌కార్డు ఉన్న వారిని అర్హులుగా గుర్తించి పశువుల కొట్టాల నిర్మాణానికి 85వేల రూపాయల వరకు మంజూరు చేస్తుంది. గొర్రెల సంఖ్య ఆధారంగా షెడ్ల నిర్మాణానికి నిధులు కేటాయిస్తుంది. పాడి రైతులు, పశువుల పాకల కోసం ముందుకు వచ్చేలా ఉపాధి హామీ అధికారులు ప్రోత్సహిస్తున్నారు.

● దరఖాస్తు చేసుకునే విధానం

పశువుల కొట్టాలు, గొర్రెల షెడ్ల నిర్మాణానికి ముందుగా గ్రామ పంచాయతీ తీర్మానం అవసరం. అనంతరం ఉపాధి హామీ జాబ్‌కార్డు, ఆధార్ కార్డ్, సంబంధిత పశుసంవర్ధక శాఖ అధికారుల నుంచి జీవాలు ఉన్నట్లు ధ్రువీకరణ పత్రం తీసుకోవాలి. పెంపకందారుడికి వ్యవసాయ భూమి ఉన్నట్లుగా తహసీల్దార్ నుంచి ధ్రువీకరణ పత్రం తీసుకుని మండల పరిషత్ కార్యాలయ అధికారికి దరఖాస్తు అందించాలి. పరిశీలన అనంతరం ఉపాధి హామీ నుంచి జీవాల సంఖ్య ఆధారంగా యూనిట్ కేటాయించి నిధులు మంజూరు చేస్తారు.

● కోటగిరి ఉమ్మడి మండలంలో 10 యూనిట్లు మంజూరు

కోటగిరి ఉమ్మడి మండలంలో ఉపాధి హామీలో పశువుల పాకల నిర్మాణానికి 10 యూనిట్లు మంజూరయ్యాయి. కోటగిరిలో రెండు, పొతంగల్‌లో రెండు, జల్లాపల్లిలో రెండు చొప్పున నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. ఆరింటిలో నాలుగు పూర్తి కాగా మరో రెండు నిర్మాణంలో ఉన్నాయి. పశువుల పాకల నిర్మాణానికి ముందుకు వస్తే మరిన్ని యూనిట్లు మంజూరు చేస్తామని ఉపాధి హామీ అధికారులు తెలిపారు.



జల్లాపల్లిలో పూర్తి కావస్తున్న పశువుల పాక



పొతంగల్‌లో పూర్తయిన పశువుల పాక

● సద్వినియోగం చేసుకోవాలి



గంగారాం, ఏపీవో, కోటగిరి

ప్రభుత్వ పథకాలపై అన్ని గ్రామాలలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. అర్హులు ఆ గ్రామానికి సంబంధించిన ఉపాధి హామీ సిబ్బంది ద్వారా పూర్తి వివరాలు తీసుకోవాలి. పశువుల కొట్టాలు, గొర్రెల షెడ్ల మంజూరులో అన్ని వర్గాలకు ప్రాధాన్యం ఇస్తున్నాం. ఈ అవకాశాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలి.

అంతటా ఘనంగా ఎన్టీఆర్ జయంతి

● ఎన్‌టీఆర్ అభిమాన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా మెగా రక్తదాన శిబిరం
● ఎన్‌టీ రామారావుకు భారత రత్న ఇవ్వాలన్న అభిమానులు



కమ్మ సంఘంలో ఎన్‌టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం



బోధన్‌లో మెగా రక్తదాన శిబిరంలో పాల్గొన్న యువత



కమలాపూర్‌లో..



ముప్కాల్‌లో..



కొత్తపల్లి (ఎన్) గ్రామంలో..

బోధన్‌రూరల్, మే 28 (ఆంధ్రజ్యోతి): తెలుగు జాతి కీర్తిని నలు దిశలా వ్యాపింపజేసిన ఘనత ఎన్‌టీఆర్‌దేనని ఎన్‌టీఆర్ అభిమాన సంఘం నాయకులు అన్నారు. బుధవారం బోధన్‌లో నందమూరి తారక రామారావు 102వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బోధన్‌లోని కమ్మ సంఘంలో మెగా రక్తదాన శిబిరం, ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎన్‌టీఆర్ అభిమాన సంఘం నాయకులు శివన్నారాయణ మాట్లాడుతూ నందమూరి తారక రామారావు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆనాడు బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన పథకాలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయన్నారు. ప్రజల గుండెల్లో ఆయన చిరస్థాయిగా ఉండిపోయ్యారన్నారు. ఆయన చేసిన సేవలు చరిత్రలో నిలిచిపోతాయన్నారు. ఆయన చేసిన కృషికి భారత రత్న అవార్డు ఇవ్వాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. రక్తదాన శిబిరానికి యువత ముందుకు వచ్చిందని సుమారు 100 యూనిట్ల వరకు రక్తదానం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌టీఆర్ అభిమాన సంఘం నాయకులు శివన్నారాయణ, గాంధీ, కృష్ణ మోహన్, శరత్ రెడ్డి, నందమూరి అభిమాన సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● తెలుగు దేశం పార్టీ ఆధ్వర్యంలో..

బోధన్ మండలంలోని తెలుగు దేశం పార్టీ ఆధ్వర్యంలో బోధన్ పట్టణంతో పాటు మండలంలోని ఏరాజ్‌పల్లి, జాడిజమాల్‌పూర్, పెంటాఖుర్దు గ్రామాలలోని ఎన్‌టీఆర్ విగ్రహాలకు తెలుగు దేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తెలుగు దేశం పార్టీ అడహాక్ కమిటీ సభ్యులు కోట గోపాల్ రెడ్డి, పావులూరి వెంకటేశ్వర్ రావు, సీహెచ్‌వీ హన్మంత్ రావులు మాట్లాడుతూ తెలుగు జాతి కీర్తిని నలు దిశాల వ్యాపింపజేసిన ఘనత ఎన్‌టీఆర్‌దేనని అన్నారు. ఈ కార్యక్రమంలో బోధన్ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సచిన్ పటేల్, పట్టణ అధ్యక్షులు బాల గంగాధర్ రావు, సుబ్బారావు, ఈశ్వర్ రావు, అల్లంనేని సాయి, రావెళ్ళ శ్రీనివాస్, బాబురావు, రామారావు, సుధాకర్ మేస్త్రి, రామారావు, వెంకటేశ్వర్ రావు, గోగినేని సుబ్బారావు, విఠల్, సత్యనారాయణ, రవికుమార్, టీడీపీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

నవీపేట: మండలంలోని కమలాపూర్‌లో బుధవారం తెలుగు దేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌టీఆర్ విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాగిరెడ్డి, శ్రీనివాస్ రావు తదితరులున్నారు.

యుగ పురుషుడు ఎన్‌టీఆర్

వర్ని: యుగ పురుషుడు తెలుగు జాతి ఆత్మ గౌరవాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహ నాయకుడు ఎన్‌టీ రామారావు అని వివిధ పార్టీల నాయకులు ప్రశంసించారు. ఎన్‌టీఆర్ జయంతి సందర్భంగా వర్నిలో బుధవారం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బి.విఠల్, ఏఎంసీ ఉపాధ్యక్షులు వెలగపూడి గోపాల్, విండో చైర్మన్ నామాల సాయిబాబా, కమ్మ సంఘం నాయకులు రెడ్డి చిన్న వీర్రాజు, వల్లూరి గణపతి రావు, ఎం.పోతన, మ్యాట్రిక్స్ నవీన్, కనకరాజు, పట్టాభి పాల్గొన్నారు.

నంది పేట: మండల కేంద్రంలో టీడీపీ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ 102వ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముందుగా పార్టీ ఎన్ టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం జెండా విష్కరణ చేశారు. కేక్ కట్ చేసి నోటిని తీపి చేసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర బీసీ సెల్ నాయకులు గజ్‌బీంకర్ జ్యోతి నారాయణ మాట్లాడుతూ ఎన్‌టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పేదల ప్రజల కోసం తీసుకొచ్చిన పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు వట్టిగుంట శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి అర్యపల్లి లక్ష్మీపతి, నాయకులు లక్ష్మీ నారాయణ గౌడ్, చంద్రు సాయిబాబా, సజ్జ భాస్కర్‌రావు, గొర్రెపాటి మురళి, పీరాజీ రాజశేఖర్, షేక్ గౌస్, క్రాంతి కుమార్ ఉన్నారు

కొత్తపల్లి (ఎన్)లో..

వేల్పూర్ : మండలంలోని కొత్తపల్లి(ఎన్) గ్రామంలో మాజీ ముఖ్య మంత్రి దివంగత నందమూరి తారక రామారావు జయంతి వేడుకలను పార్టీలకు అతీతంగా ఘనంగా నిర్వహించారు. ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఎన్‌టీఆర్ జయంతి వేడుకలను రాజకీయ పార్టీలకు అతీ తంగా మాజీ సర్పంచ్ గడ్డం నర్సారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి వేడుకలలో ఆర్మూర్ డివిజన్ లోని అప్పటి టీడీపీ నాయకులు భారీ సంఖ్యలో హాజరై ఎన్‌టీఆర్‌కు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కార్య నిర్వాహకులు కొత్తపల్లి మాజీ సర్పంచ్ బద్దం నర్సారెడ్డి, వేల్పూర్, జక్రాన్‌పల్లి మండలాల మాజీ ఎంపీపీలు మోతె రామాగౌడ్, అనంతరెడ్డి, రైతు జిల్లా నాయకులు మిట్టపల్లి మహిపాల్, ఏఎంసీ మాజీ చైర్మన్ కొట్టాల చిన్నారెడ్డి, ముప్కాల్ టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ముస్కు భూమేష్, అంక్సాపూర్ లారీ మల్లారెడ్డి, క్యాతం గంగారెడ్డి, సరిత మోహన్ పాల్గొన్నారు.

ముప్కాల్: ముప్కాల్ మండల కేంద్రంలో బుధవారం స్వర్గీయ ఎన్‌టీఆర్ జయంతి వేడుకలను ఎన్‌టీఆర్ అభిమానులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు డాక్టర్ రాములు, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు భూమేశ్వర్, ముస్కు ముత్తెన్న, మోతె గంగారెడ్డి పాల్గొన్నారు.

నిజామాబాద్ కల్చరల్: ప్రపంచ వ్యాప్తంగా తెలుగు జాతికి ప్రత్యేక స్థానాన్ని అందించిన నేత నందమూరి తారక రామారావు అని ప్రముఖ అష్టావధాని గణపతి అశోకశర్మ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమాఖ్య కార్యాలయంలో జయంతిని పురస్కరించుకొని ఎన్టీఆర్ చిత్రపటానికి ప్రతినిధులు పూల మాలలు వేసి నివాళులర్పించారు.

రాజకీయ భిక్ష పెట్టిన మహనీయుడు ఎన్టీఆర్

● రాష్ట్ర వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి



కోటగిరిలో కేక్‌కట్ చేస్తున్న బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి

కోటగిరి,మే28(ఆంధ్రజ్యోతి): తనలాంటి ఎందరో నాయకులకు రాజకీయ భిక్ష పెట్టిన మహనీయుడు దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు అని రాష్ట్ర వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి కొనియాడారు. కోటగిరి మండల కేంద్రంలోని మిర్జాపూర్ ఎన్‌టీఆర్ చౌరస్తాలో బుధవారం ఎన్‌టీఆర్ 102వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయ సలహదారులు పోచారం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హజరయ్యారు. ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగు జాతి కీర్తిని నలు దిశాల వ్యాపింపజేసిన ఘనత ఎన్‌టీఆర్‌కే దక్కుతుందన్నారు. సంక్షేమ రంగం అమలు చేసిన ఘనత ఎన్‌టీఆర్‌కే దక్కుతుందన్నారు. రెండు రూపాయలకు కిలో బియ్యం, నివాసపు ఇళ్లు, పింఛన్ వంటి సంక్షేమ పథకాలను అమలు చేసి దేశంలో సంక్షేమ పథకాల అమలుకు నాంది పలికిన గొప్ప రాజనీతిజ్ఞుడని కొనియాడారు. రాజకీయం అంటే వ్యాపారం కాదని ప్రజాసేవకే తగిన ప్రాధాన్యం ఇవ్వాలన్న సంకల్పంతో పని చేశారని కొనియాడారు. తాను చదువుకునే రోజుల్లో ఎన్‌టీఆర్ పిలిచి రాజకీయ భిక్ష పెట్టారని తద్వారా ఎమ్మెల్యేగా, మంత్రిగా, స్పీకర్‌గా, రాష్ట్ర వ్యవసాయ సలహదారులుగా పని చేస్తున్నానని ఆయన పేర్కొన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌టీఆర్ సంఘం అధ్యక్షులు శ్రీధర్, రమేష్ బాబు, ఉదయ్ భాస్కర్, ఆనంద్, విండో అధ్యక్షులు సునీల్ కుమార్ చౌదరి, కూచి సిద్దు, పత్తి లక్ష్మణ్, నాయకులు ఏజాజ్ ఖాన్, జుబేర్, శ్రీనివాస్ రావు, కొట్టం మనోహర్, బర్ల మధు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ మండల పరిషత్ కార్యాలయం

మరమ్మతులకు నోచుకునేదెన్నడో..!?

● కష ్టతరంగా పంచాయతీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణ పనులు ● పట్టించుకోని పాలకులు, అధికారులు

ఆంధ్రజ్యోతి పరిశీలన





కూలిపోయిన మండల పరిషత్ ప్రహరీ



ధ్వంసమైన ఫ్లోరింగ్

సిరికొండ మే 28 (ఆంధ్రజ్యోతి) మండల అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన మండల పరిషత్ కార్యాలయం మరమ్మతులకు నోచుకునేదెప్పుడో అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కార్యాలయం శిథిలావస్థకు చేరడం వల్ల రాబోయే ఎంపీటీసీ, సర్పంచ్‌ల ఎన్నికల నిర్వహణ చేయడం అధికారులకు కష్ట తరంగా మారుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. శిథిలావస్థకు చేరిన కార్యాలయం మరమ్మతు పనులు చేయిస్తేనే ఎన్నికల నిర్వహణ కోసం వచ్చే సామగ్రిని నిలువ చేయడం సులభతరమవుతుందని సిబ్బంది చెపుతున్నారు. సిరికొండ మండల పరిషత్ కార్యాలయం లోపల ఫ్లోరింగ్ ధ్వంసమై ఎలుకలకు, పాములకు ఆవాస నిలయంగా మారుతుంది. కార్యాలయం నిర్మించిన స్థలం నల్లరేగడి భూమి కావడం వల్ల ఎంపీడీవో, సిబ్బంది పనులు చేసే చాంబర్లలో అడుగు బాగం ధ్వంసమై కూర్చోవడానికి ఇబ్బందిగా మారింది. ఏడాదిన్నర కాలంగా కార్యాలయం గదుల అడుగు భాగం ధ్వంసమైన మరమ్మత్తుకు నోచుకోకపోవడం వల్ల సందర్శకులు, ప్రజలు, కార్యాలయ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా సిబ్బంది పనులు చేసే గదిలో మాత్రం ఎక్కువ ధ్వంసమై కుర్చీలు, టేబుళ్ల ముందుకు జరుపుకోవాల్సిన దుస్థితి నెల కొన్నది. అప్పుడప్పుడు పాములు వచ్చి చేరుతాయని ఆపీస్ సిబ్బంది చెబుతున్నారు. ఎంపీడీవో గదిలోకి వెల్లె దర్వాజ వద్ద ఫ్లోరింగ్ పగిలిపోయి నడవడానికి ఇబ్బందికరంగా మారింది. ఆదమరిచి నడిస్తే పడిపోవలసి వస్తుందని సిబ్బంది చెపుతున్నారు. ప్రహరీ రెండు చోట్ల పడిపోవడం వల్ల పాములు, పశువులు కార్యలయం లోపలికి రావడానికి సులువైన మార్గం ఏర్పడ్డది. సగం గోడ గత ఏడాది వర్షాకాలంలో కూలిపోగా, మరో సగం గోడ నెల రోజుల క్రితం బలమైన ఈదురు గాలులుకు పడిపోయింది. పక్కనే పంట పొలాలు ఉన్నందున విషజీవాలు, క్రిమి కీటకాలు, పశువులు లోపలికి రావడానికి సులభమయిందని సిబ్బంది చెపుతున్నారు. వర్షపు నీళ్ల కిందికి రాకుండా పైన రేకులు ఏర్పాటు చేయగా గత ఏడాది భారీగా ఈదురు గాలులు వీయడంతో ఏకంగా పై నుండి కింది పడి పోవడంతో వర్షం కురిస్తే చాలు కార్యాలయంలోకి వర్షపు నీళ్ల వచ్చి చేరు తాయి. మండల ప్రజలు మండల అభివృద్ధి కోసం నిర్విరామంగా పని చేసే కార్యా లయమే ఈవిదంగా ఉంటే కార్యలయానికి వచ్చి పోయే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోనే పరిస్థితి నెలకొన్నది. ఇందులో ప్రజా ప్రతినిధులు, అధికారులు తరచూ సమావేశమయ్యే కార్యాలయం మండలంలోని ప్రజా సమస్యలపై చర్చించుకునే కార్యాలయం బాగుండాలని ప్రజలు కోరుకుంటున్నారు. విష జీవాలు నివాసమేర్పరుచుకుని ఇబ్బందులు కలిగిస్తే పరిస్థితి ఎలా ఉంటుందని అధికారులను ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు స్పందించి కార్యాలయం మరమ్మతుకు నిధులు మంజూరు చేసి బాగు చేయించాలని సిబ్బంది, ప్రజలు కోరుతున్నారు.

ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించాము..

కార్యాలయం శిథిలావస్థకు చేరిన విషయం వాస్తమే అని ఎంపీడీవో మనోహర్‌రెడ్డి అంగీకరించారు. తాను బాధ్యతలు స్వీకరించగానే ఇరువై లక్షల తో ప్రతిపాదనలు తయారు చేయించి ప్రభుత్వానికి పంపించినట్లు ఆయన చెప్పారు. ప్రస్తుతం పూర్తి స్థాయిలో మరమ్మతు పనులు చేయించాలంటే ముప్పై లక్షలు అవసరం ఏర్పడ్డదని ఎంపీడీవో చెప్పారు.

కమ్యూనిటీ మెడిటేషన్ సెంటర్‌లో

కుటుంబ సమస్య పరిష్కారం

బోధన్‌రూరల్, మే 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కమ్యూనిటీ మెడిటేషన్ సెంటర్‌లో ఓ కుటుంబ సమస్య పరిష్కరించామని సామాజిక కార్యకర్త పద్మాసింగ్ తెలిపారు. వైష్ణవి అనే మహిళ తన తండ్రి రెండేళ్లుగా పట్టించుకోవడం లేదని మెడిటషన్ సెంటర్‌లో దరఖాస్తు అందించిందన్నారు. వెంటనే వైష్ణవి తండ్రి పరమేష్‌ను పిలిపించి తన జీతంలో సగంలో, 20గుంటల భూమి వైష్ణవికి ఇస్తానని చెప్పడం జరిగిందన్నారు. వీరిద్దని అదనపు న్యాయమూర్తి శ్రీనివాస్ దగ్గరికి తీసుకెళ్లగా ఆయన వారిద్దరితో మాట్లాడి సమస్యను పరిష్కరించినందుకు పద్మాసింగ్, రమణ రెడ్డి, సుమలతలను అభినందించారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి


కల్యాణ లక్ష్మి చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

ఎడపల్లి, మే28(ఆంధ్రజ్యోతి):అధికారంలోకి వచ్చిన అతికొద్ది రోజు ల్లోనే ప్రతీ ఒక్కరికి సంక్షేమాన్ని అందించి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని, ప్రజా సంక్షేమం కోసం నిరంతరం కృషి చేసిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. బుధవారం ఎడపల్లి మండల కేంద్రంలోని మండల పరిషత్ కా ర్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అం దించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదింటి ఆడబిడ్డకు పెద్దన్నగా కుటుంబానికి ఆసరాగా ఉండేందుకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకం ద్వారా లక్షరూపాయలను అందించడంతో ఆకుటుం బానికి ఉపయోగపడుతుందని, రాష్ట్రంలోని ప్రతీ పేద కుటుంబంలో ఆడబిడ్డకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ ద్వారా ఆ కుటుంబాలను ఆదుకుంటున్నా మని ఆయన పేర్కొన్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పులు తీర్చడానికే రాష్ట్ర ఖజానాఖాళీ అయి ఇబ్బందులు పడుతున్న తరుణంలో రాష్ట్ర ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ అందిస్తున్నామని, మండలంలో దాదాపు 436 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేశామని, 68 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందించడం జరిగిందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కొరకు అధిక ధరలకు ఇసుక అమ్ముతున్నారని, అలా జరుగకుండా అధికారులు దృష్టి సారించి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు తక్కువ ధరకే ఇసుక అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి నిధులు ఉన్నాయని త్వరగా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం మెరుగు పడిందని 75 శాతానికి పైగా ఉత్తీర్ణత సాధిస్తున్నారని, పిల్లల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించి అప్పుల పాలవకుండా ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చదివించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గడుగు గంగాధర్, మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బిల్లా రాంమోహన్, పార్టీ మండల అధ్యక్షులు పులి శ్రీనివాస్ రావు, ఎడపల్లి సహకార సంఘం అధ్యక్షులు పోల మల్కారెడ్డి, నాయకులు బంజ కామప్ప. బొబ్బిలి శ్రీనివాస్, శంకర్ నాయుడు, కంచరి శ్రీనివాస్, తూట్కూర్ రవీందర్ రెడ్డి, మండలంలోని ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, లబ్దిదారులు తదితరులు ఉన్నారు.

● కార్యకర్తల సమష్టి కృషే పార్టీకి బలం

బోధన్‌రూరల్: కార్యకర్తల సమిష్టి కృషి, ఐక్యతతోనే పార్టీకి పార్టీకి మరింత బలం చేకూరుతుందని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. బుధవారం సాలూర మండల కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపంలో జరిగిన శుభకార్యంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్, నాగేశ్వర్ రావు, మందర్నా రవి, ఏఎంసీ చైర్మన్ చీల శంకర్, సొసైటీ చైర్మన్ అల్లె జనార్ధన్, అల్లె రమేష్, చిద్రపు అశోక్, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. హున్స గ్రామానికి చెందిన జంగం మఠ్‌వాలే ఈరయ్యప్ప మారాజు గారి కొడుకు కూతురు నూతన వస్త్రాధరణలో ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు.

కష్టపడి పనిచేసిన వారికే పార్టీ పదవులు

● రాష్ట్ర ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్ తిరుపతి


సమావేశంలో మాట్లాడుతున్న తిరుపతి

ధర్పల్లి, మే 28 (ఆంధ్రజ్యోతి): కష్టపడి పనిచేసిన వారికే పార్టీ పదవులు లభిస్తాయని రాష్ట్ర ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్ తిరుపతి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ధర్పల్లి, ఇందల్వాయి, సిరికొండ మండలాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్ తిరుపతి పార్టీ శ్రేణులకు దిశనిర్దేశం చేశారు. రాష్ట్ర ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్ సైతం ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా పార్టీకి సేవ చేసిన వారికే పార్టీ పదవులు లభిస్తాయని అన్నారు. పార్టీ బలోపేతానికి అందరూ కలిసి కృషి చేయాలని ఆయన సూచించారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని పిలుపునిచ్చారు. అన్ని జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచులను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. పార్టీలో యువతకు సముచిత స్థానం కల్పించనున్నట్లు ఆయన చెప్పారు. ప్రభుత్వా నికి ప్రజలకు మధ్య కార్యకర్తలు వారధిగా ఉండాలన్నారు. కష్టపడ్డ వారికే పార్టీలో గుర్తింపు ఉంటుందని వారికే పార్టీ పదవులను వరిస్తాయని అన్నారు. ఈకార్యక్రమంలో ఐసీడీఎస్ చైర్మన్ తారాచంద్ నాయక్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నగేష్‌రెడ్డి, పార్టీ అధ్యక్షుడు ఆర్మూర్ చిన్నబాల్‌రాజ్, మనోహర్ రెడ్డి, మిట్టపల్లి గంగారెడ్డి, చెలిమెల నర్సయ్య, శ్రీనివాస్,మహేందర్, సింగిల్ విండో చైర్మన్ మల్లికార్జున్, పార్టీ నాయకులు, కార్యకర్తలు,బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు సంతోష్‌రెడ్డి,ఇందల్వాయి, సిరికొండ మండాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పార్టీకోసం కష్టపడిన వారికే పదవులు

● నష్టం చేసే వారిపై క్రమశిక్షణచర్యలు: ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

డిచ్‌పల్లి, మే 28 (ఆంధ్రజ్యోతి):కాంగ్రెస్ పార్టీలో పనిచేసే వారికి తప్పకుండా పదవులు వరిస్తాయని 2017 కంటే ముందు నుంచే పార్టీ కోసం కష్టపడిన వారికి పదవులు కేటాయిస్తామని జిల్లా పార్టీ పరిశీలకులు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అన్నారు. బుధవారం మండలంలోని అమృత గార్డెన్ ధర్మారం(బి)లో జరిగిన 4మండలాల కాంగ్రెస్ కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ శ్రేణులు కలిసి కట్టుగా పనిచేయలన్నారు. వారం లోపు గ్రామ, మండల కమిటీలను పూర్తి చేయలన్నారు. పార్టీ కి నష్టం చేసే వారు ఎంతటి వారైన ఉపేక్షించేది లేదని రానున్న స్థానిక ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ కు తగిన గుణపాఠం చెప్పలన్నారు. కష్టపడిన వారికి తప్పక గుర్తింపు లభిస్తుందని అందకు తానే ఉదాహరణ అని అన్నారు. రూరల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ లో గొడవలు ఉంటే అంతర్గతంగా చర్చించుకొవాలని లేదంటే తమ దృష్టికి తీసుకురావలని ఇప్పటి వరకు జై బాపు, జై భీమ్, జై సంవిదాన్ నిర్వహించాలేని వారు ఈ వారంలో పు పూర్తి చేయాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రంతో పాటు గుజరాత్ లో సంస్థగత నిర్మాణం చేసేందుకు శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తు విధాన పర నిర్ణాయం తీసుకునేందుకు జిల్లా, అసెంబ్లీ, మండల, ఈ సమావేశాలు నిర్వహిస్తున్నమన్నారు. గడిచిన పదేళ్ల కాలంలో కాంగ్రెస్ అధికారంలో లేని సమయంలో పార్టీ కి అండగా ఉన్న వారి వివరాలు తాము సేకరిస్తున్నమని ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్ తిరుపతినాయక్ అన్నారు. కష్టపడి పనిచేసిన వారికి తప్పక గుర్తింపు ఉంటుందని 40ఏళ్ల చరిత్రలో కాంగ్రెస్ కార్యకర్తలు సమిష్టిగా పనిచేసి రూరల్ లో కాంగ్రెస్ జెండా ఎగరవేశరన్నారు. రూరల్ ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి మాట్లాడుతూ... బల్మూరి వెంకట్ ను ఆదర్శంగా తీసుకొని ప్రతి కార్యకర్త పార్టీ కోసం కష్టపడలన్నారు. అందరి సహకారంతో కార్యకర్తలు సమిష్టిగా పనిచేసి తనను ఎమ్మెల్యే గా గెలిపించరన్నారు. ఇంత వరకు తనపై 4పోలీసు కేసులు ఉన్నాయని స్థానిక సంస్థల ఎన్నికలు కార్యకర్తలపైనే ఆధారపడి ఉన్నయన్నారు. బీఆర్ఎస్ పునాదులు కొల్పోయి కుటుంబ కలహాలతో కనుమరుగు కానుందని ఆయన జోస్యం చెప్పారు. గ్రామాల్లో గెలుపు గుర్రాలకే టికెట్ లు వచ్చే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలపై ప్రచారం చేయాలని ఆయన కార్యకర్తలకు సూచించారు. నియోజకవర్గంలో 4వేల ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని ఇళ్ల నిర్మాణం తర్వాత గృహ ప్రవేశాలు కాంగ్రెస్‌పార్టీ చేసే విధంగా చొరవ చూపుతమన్నారు. కాం గ్రెస్ పార్టీలో నాయకత్వ లోపం లేదని జిల్లానే ఆదర్శ నియోజక వర్గం గా తీర్చిదిద్దేంకు కృషి చేస్తానన్నారు. ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్ బిన్ హందాన్ మాట్లాడుతూ.. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ విజయడంఖ మోగిస్తుందన్నారు. నిజామాబాద్ జిల్లా అగ్రాగా మీగా ధాన్యం కొనుగోళ్లలో నిలిచిందన్నారు. కార్యకర్తలు సమిష్టిగా పనిచేసి మోజార్టీ స్థానాలను కాంగ్రెస్ దక్కించుకోవలన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ ప్రతినిదులు కాటిపల్లి నగేశ్‌రెడ్డి, తారచంద్ నాయక్, అమృత పూర్ గంగాధర్, శేఖర్‌గౌడ్, రాంచందర్ గౌడ్, పొల సాని శ్రీనివాస్, దర్మగౌడ్, యాదగిరి,ఎల్లన్న,రామకృష్ణ,4మండలాల కార్యకర్తలు పాల్గొన్నారు.

● మీనాక్షి నటరాజన్‌ను కలిసిన రూరల్ ఎమ్మెల్యే

నిజామాబాద్ అర్బన్: రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్‌ను బుధవారం హైదరాబాద్‌లో రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో పార్టీ బలోపేతం, పార్టీ అమలు చేస్తున్న విధివిధానాల గురించి సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిపారు. ప్రతీ నియోజకవర్గంతో పాటు ప్రతీ మండలాల్లో, గ్రామాలల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల్లోకి ఏ విధంగా వెళ్తున్నాయో చర్చించారు. ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం, 200 యూనిట్లు ఉచిత కరెంటు, రైతుభరోసా, సన్నవడ్లకు బోనస్, ఉచిత బస్సు, 500లకే సిలిండర్ వంటి సంక్షేమ పథకాల గురించి చర్చించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతీ ఇంటింటికి తెలియజేసేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆమె సూచించినట్లు రూరల్ ఎమ్మెల్యే తెలిపారు.

తల్వేద లిఫ్ట్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఆయిల్, కాయిల్స్ చోరీ

● సంవత్సరంలో ఇదీ రెండోసారీ
● ఆందోళన చెందుతున్న ఆయకట్టు రైతులు


అయిల్, కాయిల్స్‌ను దొంగిలించిన తల్వేద ట్రాన్స్‌ఫార్మర్ ఇదే

నందిపేట, మే 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తల్వేద ఎత్తిపోతల పథకం రెండో స్టేజీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఆయిల్, కాపర్ కాయిల్స్ చోరీకి గురయ్యాయి.సంత్సరంలో ఇలాజరుగడం రెండోసారి.దీంతో రైతులపై సుమారు రూ5లక్షల నుంచి 6లక్షల వరకు భారం పడనుంది. మం డలంలోని లక్కంపల్లి శివారులో తల్వేద లిఫ్ట్ రెండో స్టేజీ పంప్ హౌస్ ఉంటుంది. దానికి ఒక విద్యుత్ సబ్‌స్టేషన్, మూడు, నాలుగు మోటార్లు ఉంటాయి. కరెంట్ సరఫరా కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ ఫ్రార్మర్ నుంచి మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దండగులు ఆయిల్‌ను చోరీ చేశారు. అంతే కాకుండా అందులో ఉన్న విలువైన కాపర్ కాయిల్స్‌ను ఎత్తుకెళ్లారు. ట్రాన్స్‌ఫార్మర్‌కు సంబందించిన విద్యుత్ పరికరాలను చిందర వందర చేశారు. వాటి విలువ సుమారు రూ.5 లక్షల నుంచి 6 లక్షల వరకు ఉంటుందని స్థానిక రైతులు తెలిపారు. మరో సారీ తమపై భారం పడనుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎందుకంటే గత ఏడాది క్రితమే గుర్తు తెలియని దుండగులు ట్రాన్స్‌ఫార్మర్ కాయిల్స్‌ను చోరీ చేశారు. అప్పుడు సుమారు మూడున్నర లక్షల వరకు రైతులపై భారం పడింది.మరో సారీ చోరీకి గురికావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆయిల్, కాపర్ కాయిల్స్ చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు లిఫ్ట్ పెద్ద మనుషులు తెలిపారు.

'ఒకే దేశం ఒకే ఎన్నిక'

సుభాష్‌నగర్, మే 28 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఎన్నికల విధానంలో సమగ్ర సంస్కరణనే 'ఒకేదేశం ఒకే ఎన్నిక' అంశం ముందుకు వచ్చిందని జాతీయ నాయకుడు అవనీకాంత్ పాండే అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఒకే దేశం ఒకే ఎన్నిక అనే అంశంపై మేధావులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పసుపు బోర్డు చైర్మన్ పల్లెగంగారెడ్డి, జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి, స్రవంతిరెడ్డి, గంగాధర్, న్యాలంరాజు, నాగోళ్ల లక్ష్మీనారాయణ, ఆశన్న, రణదీశ్, మేధావులు, వివిధ కుల సంఘాల పెద్దలు పాల్గొన్నారు.

'అంబేద్కర్ భారీ విగ్రహాన్ని ఎలాగైనా నిర్మిస్తాం'

సుభాష్‌నగర్, మే 28 (ఆంధ్రజ్యోతి):నగరంలోని పూలాంగ్ చౌరస్తాలో గల అంబేద్కర్ విగ్రహం చాలా చిన్నదిగా ఉందని భారీ విగ్రహాన్ని నిర్మిస్తామంటే అడ్డుకుంటున్నారని ఎలాగైనా భారీ విగ్రహాన్ని నిర్మిస్తామని మాలమహానాడు జాతీయ వర్కింగ్ ప్రసిడెంట్ గైని గంగారాం అన్నారు. జిల్లా కేంద్రంలోని పూలాంగ్ చౌరస్తాలోగల అంబేద్కర్ విగ్రహానికి మాలమహానాడు ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించి కరపత్రాలను ఆవిష్కరించారు. అంబేద్కర్ యువజన సంఘం అని పేరు పెట్టుకొని కొందరు పెద్ద విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామంటే అడ్డుకుంటున్నారని అన్నారు. కాంస్య విగ్రహ ఏర్పాటుకు అడ్డుకుంటూ ప్రతి ఒక్కరిపై కేసులు నమోదు చేస్తూ నోటీసులు జారీ చేశారని అన్నారు. భారీ విగ్రహాన్ని ఎలాగైనా ఏర్పాటు చేస్తామని కేసులకు బయపడేది లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్, చంద్ర శేఖర్, విద్యాసాగర్, విజయ, శోభన్, ప్రశాంత్, అనిల్, సుభాష్, తదితరులు పాల్గొన్నారు.

సంస్థాగతంగా కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలి

నిజామాబాద్ అర్బన్, మే 28 (ఆంధ్రజ్యోతి):రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల కోసం కాంగ్రెస్ పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని రాష్ట్ర ట్రైబల్ వెల్ఫేర్ చైర్మన్, జిల్లా పార్టీ ఇంచార్జి తిరుపతి సూచించారు. బుధవారం ఉదయం నగరంలోని కంఠేశ్వర్‌లో 8 డివిజన్‌లకు సంబంధించిన కార్యకర్తల సమావేశం, సాయంత్రం 11వ డివిజన్‌లో 12 మైనార్టీ డివిజన్‌లకు సంబంధించిన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ జిల్లాలకు ఇంచార్జిలను నియమించారని తిరుపతి అన్నారు. ఈ సమావేశంలో ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, నాయకులు రత్నాకర్, భక్తవత్సలం, రాంభూపాల్, మీసాల సుధాకర్‌రావు, బొబ్బిలి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న డిగ్రీ పరీక్షలు

డిచ్‌పల్లి, మే 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ రెగ్యూలర్, బ్యాక్‌లాగ్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా జరిగాయని ఆడిట్‌సెల్ డైరెక్టర్ ప్రొ.ఘంట చంద్రశేఖర్ తెలిపారు. ఉమ్మడి జిల్లా పరిధిలో 32పరీక్ష కేంద్రాలలో పరీక్షలు జరిగాయని ఘంట చంద్రశేఖర్ తెలిపారు. ఉదయం జరిగిన 5వ సెమిస్టర్ పరీక్షలకు 4766 విద్యార్థులకు గాను 4401 హాజరయ్యారు. 365 గైర్హాజరయ్యారు.మధ్యాహ్నం జరిగిన సెమిస్టర్ పరీక్షలకు 3506గాను 3143 హాజర య్యారని, 363 గైర్హాజరయ్యారని చంద్రశేఖర్ తెలిపారు.

టీయూలో వీర సావర్కర్ జయంతి

డిచ్‌పల్లి, మే 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ యూనివర్సిటీలో ఏబీవీపీ వర్సిటీ శాఖ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య వీర సావర్కర్ జయంతి వేడుకలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ఏబీవీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరి రాజు హాజరయ్యారు. స్వాతంత్ర్యం ఊపిరిగా దేశ భక్తి దైవంగా ప్రతిజ్ఞ చేసుకొని జీవితాన్ని దేశానికి అర్పించిన గొప్ప నాయకుడని అని ఆయన సేవాలను కొనియడారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ అధ్యక్షుడు సాయి, నాయకులు, నవీన్, అనిల్, అజయ్, శ్రీకాంత్, వినోద్ పాల్గొన్నారు.

ధర్మారం(బి)లో ఎన్టీఆర్‌కు ఘన నివాళి


ఎన్టీఆర్ విగ్రహానికి నివాళ్లు అర్పిస్తున్న టీడీపీ నాయకులు

డిచ్‌పల్లి, మే 28 (ఆంధ్రజ్యోతి): తెలుగు దేశం పార్టీ వ్యవస్థాపకుడు, మాజీ సీఎం నందమూరి తారకరామారావు 103 వ జయంతి పురష్కరించుకొని ధర్మారం(బి) లోని ఎన్టీఆర్ విగ్రహానికి తెలుగుదేశం నాయకులు నివాళ్ల అర్పించారు. ఈ సందర్బంగా ఆయన రాష్ట్రానికి చేసిన సేవాలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పిచ్చేశ్వర్ రావు, నాగార్జున, పున్నరావు, నాని, సుబ్బరావు, రామకృష్ణ, వెంకటేశ్వరరావు, కేశవ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాధాకృష్ణ విద్యాలయ పూర్వ విద్యార్థుల సమ్మేళనం


ఆత్మీయంగా కలుసుకున్న 2007-08 పూర్వ విద్యార్థులు

నిజామాబాద్ అర్బన్, మే 28 (ఆంధ్రజ్యోతి):నగరంలోని రాధాకృష్ణ విద్యాలయం (ఆర్యసమాజ్) 2007-08 సంవత్సరానికి చెందిన పదవ తరగతి విద్యార్థులు బుధవారం పూర్వవిద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించారు. 18 ఏళ్ల తర్వాత పూర్వవిద్యార్థులంతా ఒక్కచోట చేరి సందడి చేశారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ తమకు విద్యాబుద్దులు నేర్పిన గురువులకు ఆత్మీయ సత్కారం చేశారు. ఈ స్థాయిలో ఉండటానికి కారకులైన తల్లిదండ్రులను, గురువులను ఎప్పుడూ గౌరవించుకోవాలని ఎంత ఎదిగిన తల్లిదండ్రులను, గురువులను మరువవద్దన్నారు. క్రమశిక్షణను అలవర్చుకొని భవిష్యత్తు తరాలకు నేర్పించాలని జీవితంలో ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. ఈ సంద ర్భంగా పూర్వ విద్యార్థులు చిన్నతనంలో చేసిన పనులను గుర్తు చేసుకొని భావోద్వేగానికి గురయ్యారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వేను తనిఖీ చేసిన కమిషనర్


వివరాలు తెలుసుకుంటున్న కమిషనర్

సుభాష్‌నగర్, మే 28 (ఆంధ్రజ్యోతి):ఇందిరమ్మ ఇళ్లసర్వే తీరును నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్ పరిశీలించారు. నగరంలోని 43వ డివిజన్ పాములబస్తీ ప్రాంతంలో ఉదయం పర్యటించా రు. వాడ వాడలా తిరుగుతూ అధికారులతో కలిసి సర్వే తీరును పరిశీలించారు. సర్వే పక్కాగా జరిగేలా చూడాలని ఎలాంటి అవకతవకలు జరుగకుండా పకడ్బందీగా నిర్వహించాలన్నారు. అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని అన్నారు.ఈకార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పసుపు బోర్డుకు కార్యాలయం కేటాయింపుపై సంబరాలు

(ఐదో పేజీ తరువాయి)

జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాలు పసుపు బోర్డు కోసం ప్రయత్నించిన ఎంపీ ధర్మపురి అర్వింద్ తొలి ప్రయత్నంతోనే జిల్లాలో పసుపు బోర్డు ఏర్పాటు చేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కార్యాలయానికి జిల్లా కేంద్రంలోని రూరల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం కేటాయించడం అభినందనీయమని రాష్ట్ర ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆర్‌అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి పసుపు బోర్డుపై అవాకులు చెవాకులు పేలుతున్నారని మార్కెట్‌లో ఉన్న రైతులను రెచ్చగొట్టి ధర్నాలు చేయించారని అన్నారు. 2019 నాటి నుంచి అర్వింద్ పసుపు బోర్డు సాధించే సంకల్పంతో ప్రతీరోజు శ్రమించారని తెలిపారు. అనంతరం బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులాచారి మాట్లాడుతూ.. ఐదు దశాబ్దాల కల పసుపు బోర్డు ఏర్పాటు అన్నారు. సీఎం కూతురు అయి ఉండి కూడా కల్వకుంట్ల కవిత తన వాగ్దానాన్ని నిలుపుకోలేకపోయారని అన్నారు. 30ఏళ్లుగా దేశంలో ఎక్కడా ఏ బోర్డు ఏర్పాటు చేయలేదని పసుపు బోర్డు ఏర్పాటు తర్వాతనే మరో మూడు బోర్డులు ఏర్పాటు అయ్యాయని అన్నారు. బీఆర్ఎస్ ప్రభు త్వం గత పదేళ్లలో పసుపు బోర్డు కోసం ఏం చేశారో చెప్పాలన్నారు. వ్యక్తిగత జీవితం పక్కనబెట్టి ఎంపీ అర్వింద్ బోర్డు కోసం కృషి చేశారని అన్నారు. బీఆర్ఎస్ నాయకులకు ధైర్యం ఉంటే పసుపు బోర్డు తెచ్చిన అర్వింద్‌ను అభినందించాలన్నారు. దిగజారుడు రాజకీయాలు చేయవద్దని హితవు పలికారు. అనవసరంగా ఎంపీ అర్వింద్‌పై మాట్లాడటం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో స్రవంతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్ ఏడిగా శ్రీనివాస్ ప్రసాద్

నిజామాబాద్ అర్బన్, మే 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి అసిస్టెంట్ డైరెక్టర్‌గా శ్రీనివాస్ ప్రసాద్ రానున్నారు. ఈయన ప్రస్తుతం వరంగల్‌లోని కాకతీయ మెడికల్ కాలేజీలో ఏవోగా విధులు వేస్తున్నారు. పదోన్నతిపై జీజీహెచ్‌కు ఏడిగా రానున్నారు.గత ఐదు నెలలుగా ఇన్‌చార్జిగా ఏడి తో పాలన కొనసాగుతుంది.

విద్యుదాఘాతానికి యువకుడి బలి

● విద్యుత్ అధికారుల నిర్లక్ష్యానికి నిరసనగా గ్రామస్థుల రాస్తారోకో


రాస్తారోకో చేస్తున్న యువకులు, గ్రామస్థులు


మృతుడు నవీన్

సిరికొండ మే 28 (ఆంధ్రజ్యోతి) లూస్‌లైను యువకుడి ప్రాణాలను బలిగొన్న సంఘటన నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలం కొండూర్ గ్రామంలో బుధవారం జరిగింది. గ్రామస్థులు, పోలీసుల తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కొండూర్ గ్రామ ప్రక్కనే 11 కేవీవైర్లు లూస్‌కావడం మనిషికి తాకే విధంగా ఉన్నందున అది గమనించని వేల్పూర్ నవీన్(31) అనే యువకుడు టాయిలెట్ కని వెళ్లి బలయ్యాడు. కొండూర్ గ్రామంలో రవి వద్ద నవీ న్ బావ వడ్రంగి పనిచేస్తున్నడని తెలిసి గ్రామానికి వచ్చాడు. మధ్యాహ్నం వేళలో టాయిటెల్ కోసం వెళ్లి వైర్లు తగిలిఅక్కడిక్కడే మృతిచెందాడన్నారు .టాయిలెట్ కోసం కూర్చున్న నవీన్ లేవడంతో నొదురుకు వైర్లు తగిలి అక్కడిక్కడే మృతిచెందాడు, కాలుకు సైతం దెబ్బ లు తగిలినట్లు స్థానికులు తెలిపారు. స్థానికులు 108 అంబులెన్స్‌కు ఫోన్‌చేసి సమాచారం అందించగా అంబులెన్స్ వారు వచ్చి ఆసుపత్రికి తీసుకెళ్లారు. కాని అప్పటికే నవీన్ మృతి చెందినట్లు అంబులెన్స్ సిబ్బ ంది చెప్పారు. నవీన్ డిచ్‌పల్లి మండలం సుద్దులం గ్రామస్థుడని స్థానికులు చెప్పారు. అతనికి వివాహం కాలేదని తెలిసింది. తల్లిదండ్రులు ఉన్నారు. కుమారు డు చనిపోయాడని తెలుసుకున్న తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా రోదిస్తున్నారు. చుట్టం చూపుగా వచ్చి ప్రాణాలు పోగొట్టుకున్న నవీన్ దయనీయ పరిస్థితిని గమనించిన కొండూర్ గ్రామస్థులు విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యానికి నిరసనగా రాస్తారోకో చేశారు. 11 కేవీ వైర్లు కిందికి ఉన్నాయని సరిచేయాలని ట్రాన్స్‌కో అధికారుల దృష్టికి చాలాసార్లు తీసికెళ్లిన ఎవరు పట్టించుకోని పాపాని నిండు ప్రాణం పోయిందని యువకులు పోలీసు అధికారుల దృష్టికి తీసుకె ళ్లారు. సీఐ భిక్షపతి సమక్షంలోనే ట్రాన్స్‌కో ఏఈని నిలదీశారు. మీరు వైర్లను సరిచేసి ఉంటే ఒక అమాయకుడైన యువకుడి ప్రాణం పొయ్యేదా అని నిలదీశారు. సీఐ భిక్షపతి స్థానికులకు నచ్చ చెప్పి రాస్తారోకోను విరమింప చేశారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలని సీఐ కోరారు. గ్రామస్థులు, మరణించిన యువకుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎల్.రామ్ తెలిపారు. పోస్టు మార్టం కోసం శవాన్ని నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి నట్లు ఎస్సై తెలిపారు.

చికెన్ ధరలు



రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.130	రూ.240	రూ. 260
వెన్‌కాబ్(కిలో)	: రూ.140	రూ.250	రూ. 270



బంగారం ధరలు



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.96,700	రూ.89,100	రూ.1025

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : మిషన్ ఇంపాజిబుల్ (ఇంగ్లీష్) (10.05, 4.20, 10.35)
: సింగిల్ (1.35, 7.50)
స్క్రీన్-2 : లిలో అండ్ స్టిచ్ (3డి తెలుగు) (10.40)
: శుభం (1.05)
: ఏఎస్ (3.50, 10.30)
: మిషన్ ఇంపాజిబుల్ (7.00)
స్క్రీన్-3 : బూల్ చౌక్ మాఫ్ (హిందీ) (11.35, 8.00, 10.40)
: ఫైనల్ డిస్టనేషన్ బ్లడ్ లైన్స్ (ఇంగ్లీష్) (2.15)
: హిట్-3 (4.45)
స్క్రీన్-4 : శుభం (11.00, 7.30)
: వర్గం (రీరిలీజ్) (1.40)
: ఫైనల్ డిస్టనేషన్ బ్లడ్ లైన్స్ (ఇంగ్లీష్) (5.00, 10.10)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : ఏఎస్ (1.30, 7.35)
: మిషన్ ఇంపాజిబుల్ (తెలుగు) (4.30, 10.30)
స్క్రీన్-2: ఒక బృందావనం (11.00)
: సింగిల్ (1.30, 5.00, 7.30, 10.30)
స్క్రీన్-3 : లిలో అండ్ స్టిచ్ (ఇంగ్లీష్ 3డి) (1.30, 7.30)
: ఒక బృందావనం (4.30, 10.20)

లలితామహల్ : వర్షం (11.15, 2.15, 6.15, 9.15)
దేవి : సింగిల్ (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : మిషన్ ఇంపాజిబుల్ (తెలుగు) (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : ఏఎస్ (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్